SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131


సంపుటి : 18 సంచిక : 242 ఎడిటర్ : విక్రం కుమార్ ఆదివారం 11 మే 2025 ప్రచురణ : హైదరాబాద్ వెల: రూ.5

## ఫలించిన అమెరికా దౌత్యం

- పోరు విరమణకు ఒప్పించామన్న ట్రంప్
- అగ్రరాజ్య మధ్యవర్తిత్వాన్ని ప్రస్తావించని భారత్!

**మే 10, సమయం న్యూస్, ఢిల్లీ, ఇస్లామాబాద్:** భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తతలను సడలించే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మరికొన్ని దేశాలు చేపట్టిన దౌత్యం ఫలించింది. చైనా, సౌదీఅరేబియా, జి7 తరువాయి 2లో





## కాల్పుల విరమణ..

# గంటల్లోనే పాక్ ఉల్లంఘన

- పోరును వీడేందుకు తొలుత రెండు దేశాల అంగీకారం
- డీజీఎంవోల స్థాయి చర్చల్లో నిర్ణయం
- అమెరికా సహా పలు దేశాల దౌత్య యత్నాలు సఫలం
- రాత్రి పొద్దుపోయాక పరిస్థితిలో కొంత మార్పు
- డ్రోన్లతో మళ్లీ దాడులకు తెగబడిన పాక్
- పంజాబ్, గుజరాత్, రాజస్థాన్, కశ్మీర్‌లలో బ్లాకౌట్ కొనసాగింపు
- విరమణకు ముందు పాకిస్థాన్‌లో 8 సైనిక స్థావరాల్ని ధ్వంసం చేసిన భారత్
- డ్రోన్లు, క్షిపణుల్ని విజయవంతంగా అడ్డుకున్న మన సైన్యం
- కశ్మీర్‌లో ఏడుగురి మృతి

2లో

## నేడు తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు

హైదరాబాద్: ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగం ఫలితాలు ఆదివారం (11వ తేదీ) విడుదల కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని

తరువాయి 2లో

## బేషరతు కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధం

- మిత్రపక్ష దేశాల సూచనతో రష్యాకు ప్రతిపాదన
- సోమవారం నుంచి కనీసం 30 రోజులు అమలు

**మే 10, సమయం న్యూస్, కీవ్:** రష్యాతో పూర్తిస్థాయి, బేషరతు కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్, దాని మిత్రపక్ష దేశాలు శనివారం వెల్లడించాయి. సోమవారం నుంచి కనీసం 30 రోజులు కాల్పుల విరమణను పాటించేలా ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. నాలుగు ఐరోపా దేశాల నేతలు శనివారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్, బ్రిటన్ దేశాల అధినేతలు సమావేశమై చర్చలు జరిపారు. రష్యాతో

తరువాయి 2లో





## భారత్ సత్తా ప్రపంచానికి తెలిసింది

- వంద శాతం లక్ష్య ఛేదన
- గురితప్పకుండా దాడులు చేయటమే రుజువు
- విశ్రాంత ఎయిర్ మార్షల్ జొన్నలగెడ్డ చలపతి

మే 10, సమయం న్యూస్: 'ఆపరేషన్ సిందూర్'తో మన సైనిక సత్తా ప్రపంచానికి తెలిసిందని భారత వాయుసేన(ఐఏఎఫ్) సదరన్ ఎయిర్ కమాండ్ మాజీ కమాండర్ ఇన్ చీఫ్, విశ్రాంత ఎయిర్ మార్షల్ జొన్నలగెడ్డ చలపతి

తరువాయి 2లో

# అందాల పండగ..



- 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఘనంగా శ్రీకారం
- ప్రపంచవ్యాప్తంగా 110 దేశాల నుంచి హాజరు
- వేడుకలను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 250 మంది కళాకారులతో కనులపండువగా పేరిణి నృత్యం
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా
- తెలంగాణ సాంస్కృతిక వైభవం కళ్లకు కట్టేలా ప్రదర్శనలు
- ర్యాంప్‌పై తళుక్కున మెరిసిన సుందరీమణులు

మే 10, సమయం న్యూస్, హైదరాబాద్: అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ సుందరి పోటీలు శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం మిస్ వరల్డ్ 72వ పోటీల ఆరంభ వేడుకలకు వేదికైంది. తెలుగు రాష్ట్రాల

తరువాయి 2లో

# ముగ్గురు మిత్రుల ఆఖరి ప్రయాణం



- ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టిన కారు
- మంటలు చెలరేగి ఇద్దరు సజీవ దహనం.. చికిత్స పొందుతూ మరొకరి మృతి

**మే 10, సమయం న్యూస్, హైదరాబాద్:** : కొత్త కారులో అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)ను చుట్టొద్దామని బయల్దేరిన స్నేహితుల ప్రయాణం విషాదాంతమైంది. ఆగి ఉన్న వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ముగ్గురు మరణించారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ బహదూర్‌పుర హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రితేశ్ అగర్వాల్ కుమారుడు దీపేశ్ అగర్వాల్(23). రితేశ్ ఇటీవల కొత్త కారు కొనగా దీపేశ్

తరువాయి 2లో

# దేశం కోసం ఏకమవుతాం




- ఉగ్రవాదంపై పోరులో అండగా నిలుస్తాం
- రాజ్‌భవన్‌లో సర్వమత సమావేశంలో తీర్మానం
- ఆపరేషన్ సిందూర్ మన బలాన్ని, బాధ్యతను చాటింది
- గవర్నర్ అబ్దుల్ నజీర్
- మన ప్రజలను ఇబ్బంది పెడితే సహించబోమని చాటాం
- సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

2లో

# కాల్పుల విరమణ.. గంటల్లోనే పాక్ ఉల్లంఘన

దిల్లీ, శ్రీనగర్, జమ్మూ: భారత్, పాక్ ఉద్రిక్తతలు చల్లారినట్లే చల్లారి మళ్లీ వేడందుకున్నాయి. అమెరికా, మరికొన్ని దేశాల దౌత్యంతో.. రెండుదేశాల అంగీకారంతో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ఈ మేరకు 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో) స్థాయిలో రెండు దేశాల అధికారుల మధ్య చర్చలు ఫలించాయి. అయితే కాసేపటికే పాకిస్థాన్ మళ్లీ దాడులకు తెగబడింది. సరిహద్దులోని పలు ప్రాంతాలపైకి డ్రోన్లు ప్రయోగించింది. మన సైన్యం వాటిని సమర్థంగా నిలువరించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ.. సాయంత్రం 6 గంటల సమయంలో కాల్పుల విరమణపై ప్రకటన చేశారు. రెండు దేశాలు శాంతికి అంగీకరించాయని అంతకుముందే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం.. భూతల, గగనతల, సాగరజలాల్లో అన్నిరకాల కాల్పులు, సైనిక చర్యలను రెండు దేశాలు నిలిపేస్తాయి. దీనికి పాకిస్థాన్ బేషరతుగా అంగీకరించిందని మిస్రీ తెలిపారు. 'రెండు దేశాల డీజీఎంవోలు శనివారం సాయంత్రం 3.35 గంటల సమయంలో నేరుగా మాట్లాడుకున్నారు. రెండువైపులా అన్నిరకాల సైనిక కార్యకలాపాలను నిలిపేయాలని నిర్ణయించారు. మళ్లీ వారు 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు చర్చలు జరుపుతారు' అని వివరించారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఎలాంటి ముందస్తు, తదుపరి షరతులు లేకుండా, ఇతర అంశాలతో ముడిపెట్టకుండా పాక్ అంగీకారం తెలిపిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. పాక్ విదేశాంగ మంత్రి ఇశాక్ డార్ కూడా కాల్పుల విరమణను ధ్రువీకరించారు. తాము ఎల్లప్పుడూ ఈ ప్రాంతంలో శాంతి, భద్రతను కోరుకుంటామని స్పష్టంచేశారు. కాల్పుల విరమణ అమల్లోకి రాగానే సరిహద్దులోని చాలా ప్రాంతాల్లో బ్లాకౌట్ ఎత్తేశారు.

**కొద్ది గంటల్లోనే మళ్లీ..**

శనివారం రాత్రి మళ్లీ కలకలం రేగింది. జమ్మూ కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లు కనిపించాయి. దీంతో గగనతల రక్షణ వ్యవస్థల్ని ఉపయోగించి, వాటిని కూల్చేశారు. శ్రీనగర్‌లో పలుచోట్ల పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అఖ్నూర్, పింజార్, బారాముల్లా, అనంతనాగ్, బట్వారాలలో పాక్ డ్రోన్లను సైన్యం కూల్చేసింది. కాల్పులేమీ జరగలేదు. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చాకా శ్రీనగర్‌లో పేలుడు శబ్దాలు వినిపించడంపట్ల ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ చర్యను తీవ్రంగా ఖండించారు. పాక్ ఉల్లంఘనను కేంద్ర ప్రభుత్వం ధ్రువీకరించింది. ఇది అత్యంత దుర్మార్గమని మండిపడింది. దీనికి పూర్తిగా పాక్‌దే బాధ్యత అని, మన సైన్యం బాధ్యతాయుతంగా స్పందిస్తూ జవాబిస్తోందని పేర్కొంది. పాక్ కూడా పరిస్థితిని సమీక్షించి తగిన తీవ్రతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికింది. ఇలాంటివాటిని బలంగా తిప్పికొట్టాలని మన సైన్యాన్ని ఆదేశించినట్లు తెలిపింది.

**బ్లాకౌట్ ఎత్తివేత.. మళ్లీ విధింపు**

కాల్పుల విరమణ ప్రకటన రాగానే పంజాబ్‌లో బ్లాకౌట్‌ను అధికారులు ఎత్తేశారు. ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించినట్లు వార్తలు రాగానే దానిని తిరిగి విధించారు. గుజరాత్, కశ్మీర్, రాజస్థాన్‌లలో బ్లాకౌట్‌ను కొనసాగిస్తున్నారు. గుజరాత్‌లోని కచ్‌లోనూ డ్రోన్లు కనిపించాయి. కశ్మీర్‌లోని నగ్రోటా వద్ద చొరబాట్లకు జరిగిన యత్నాన్ని కాల్పులతో సైన్యం వమ్ము చేసింది.

**8 సైనిక స్థావరాల ధ్వంసం**

శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్‌లోని 8 సైనిక స్థావరాలపై భారత్ శనివారం తెల్లవారుజామున విరుచుకుపడింది. రఫీక్, మురీద్, చక్లాలా, రహీంయార్ ఖాన్, సుక్కుర్, చునియన్. పర్సూర్, సియాల్‌కోట్ స్థావరాలపై మన యుద్ధ విమానాలు దాడులు చేశాయి. ఇందులో వైమానిక స్థావరాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రాడార్ సైట్లు, ఆయుధ నిల్వ కేంద్రాలున్నాయి. కచ్చితమైన లక్ష్యాలతో ఈ దాడులు చేశామని, పౌర నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వెల్లడించారు. జమ్మూలోని నియంత్రణ రేఖకు ఆవలివైపు పాక్ సైనిక శిబిరాన్ని భారత దళాలు ధ్వంసం చేశాయి. సరిహద్దులు దాటేందుకు ఉగ్రవాదులు దీనిని లాంచ్‌ప్యాడ్‌గా వాడుకుంటున్నారు. దీంతోపాటు ట్యూబ్ డ్రోన్లను భారత్‌పై ప్రయోగించడానికి వీలుగా ఇక్కడ లాంచ్‌ప్యాడ్ ఉంది. దానిని కూడా భద్రతా దళాలు ధ్వంసం చేశాయి. భారత్ దాడులను పాక్ సైన్యం అధికార ప్రతినిధి షరీఫ్ చౌధరి ధ్రువీకరించారు. తాము వాటిని అడ్డుకున్నామని తెలిపారు. భారత్ దాడుల తీవ్రతను పెంచడంతో ప్రతీకార దాడులకు 'బున్‌యాన్ అల్ మార్సోస్' (ఇనుప గోడ) పేరుతో ఎదురుదాడి చేస్తున్నట్లు పాక్ తెలిపింది. మధ్యశ్రేణి ఫతే 1 క్షిపణుల్ని ఉపయోగిస్తున్నట్లు వెల్లడించింది.

**పాక్ డ్రోన్లు, క్షిపణుల కూల్చివేత**

పాక్ కవ్వింపు చర్యలను శనివారం భారత్ విజయవంతంగా అడ్డుకుంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, ఫైటర్ జెట్లతో జమ్మూ, పంజాబ్‌లలోని పౌర ఆవాసాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులకు ఆ దేశం ప్రయత్నించింది. మొత్తం 26 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంది. శ్రీనగర్, అవంతీపొరా, ఉధంపుర్‌లలోని వైమానిక స్థావరాల సమీపంలో మెడికేర్ సెంటర్, పాఠశాల లక్ష్యంగా దాడులు చేసింది. అర్ధరాత్రి దాటాక 1.40 గంటలకు పలు హైస్పీడ్ క్షిపణులతో పంజాబ్‌లోని వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో మన స్థావరాల సమీపంలో స్వల్పనష్టం వాటిల్లిందని కర్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. దాడులనూ విజయవంతంగా తిప్పికొట్టామని స్పష్టం చేశారు.

## అందాల పండగ..

(మొదటిపేజీ తరువాయి)

చరిత్రలో ఈ పోటీలు నిర్వహించడం ఇదే ప్రప్రథమం. వేడుకలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 'హైదరాబాద్‌కు స్వాగతం, సుస్వాగతం' అంటూ నిర్వాహకులు అచ్చ తెలుగులో పలకరించారు. రామాచారి శిష్యబృందంలోని 50 మంది గాయనీగాయకులు అందెశ్రీ రచించిన రాష్ట్ర గేయం ''జయజయహే తెలంగాణ జననీ జయకేతనం'' ఆలపించారు. ప్రారంభ వేడుక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుగా సాగింది. ప్రపంచదేశాలకు మన కళల్ని అద్భుతంగా పరిచయం చేసింది.

**రౌండ్ల వారీగా వచ్చిన అందాల భామలు**

తెలంగాణ జానపద నృత్యాలతో నాలుగు ఖండాలకు చెందిన పోటీదారులను పరిచయం చేయడం వీక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చింది. కొమ్ముకోయ కళాకారులు లాటిన్ అమెరికా దేశాల పోటీదారులకు ఆహ్వానం పలికారు. తొలుత అర్జెంటీనా కంటెస్టెంట్ ర్యాంప్‌పైకి వచ్చారు. అనంతరం గోండు తెగకు చెందిన గుస్సాడి నృత్యంతో ఆఫ్రికా ఖండంలోని దేశాల పోటీదారును ఆహ్వానించారు. లంబాడీడప్పులు ప్రదర్శన విదేశీయులను అమితంగా ఆకట్టుకుంది. వీరు యూరోపియన్ దేశ పోటీదారులకు స్వాగతం పలికారు. ఒగ్గుడోలు కళాకారుల వేషధారణ, ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ జెండాను చేతబూని కళాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. వీరు ఆసియా ఖండంలోని పోటీదారులను స్వాగతించారు.

**శాంతి, ఐక్యత సందేశం**

సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకలు వైభవంగా, ప్రశాంతంగా జరిగాయి. 110 దేశాల అందాలభామలతోపాటు విదేశీ అతిథులకు తెలంగాణ ప్రభుత్వం మంచి ఆతిథ్యంతోపాటు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ వేడుకలను కోట్ల మంది తిలకించారు. ప్రపంచ శాంతికి, ఐక్యతకు మిస్ వరల్డ్ పోటీలు కూడా పాటుపడతాయని నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజీని ఈ వేడుకలు మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాయని పర్యాటకశాఖ వర్గాలు తెలిపాయి.

## ఫలించిన అమెరికా దౌత్యం

(మొదటిపేజీ తరువాయి)

దేశాలు కూడా తమవంతు పాత్ర పోషించాయి. రెండు దేశాల నాయకత్వాలతో రెండ్రోజులుగా ట్రంప్ మాట్లాడుతూ వచ్చి, కాల్పుల విరమణకు ఒప్పించారని అమెరికా ప్రకటించింది. వరసగా సాగించిన మధ్యవర్తిత్వ చర్చలతో తక్షణ, పూర్తిస్థాయి కాల్పుల విరమణకు ఇరు దేశాలూ అంగీకరించాయని 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ ప్రకటించారు. ఇరుదేశాలూ వివేకాన్ని, జ్ఞానాన్ని ప్రదర్శించాయని అభినందించారు. పాక్ ఉప ప్రధాని ఇశాక్ డార్ కూడా 'ఎక్స్' వేదికగా ప్రకటన చేస్తూ కాల్పుల విరమణ వెంటనే అమల్లోకి వస్తుందన్నారు. సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతల్లో రాజీ పడకుండానే శాంతి, సుస్థిరతల కోసం తమ దేశం ప్రయత్నిస్తోందని చెప్పారు. శాంతి మార్గానికి అంగీకరించినందుకు రెండు దేశాలకూ కృతజ్ఞతలు చెబుతున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ పేర్కొన్నారు. ట్రంప్ బృందం, ముఖ్యంగా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చేసిన కృషి ఎంతో ఉందని చెప్పారు. ట్రంప్ పోస్ట్ చేసిన కాసేపటికే రూబియో సైతం ప్రకటన చేశారు. భారత్, పాక్ ప్రధానులు, విదేశాంగ మంత్రులు, జాతీయ భద్రత సలహాదారులతో తాము మాట్లాడినట్లు చెప్పారు. అమెరికాకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతీయంగా నెలకొన్న అంశాల పరిష్కారానికి ఇది నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. పాక్‌లోని వివిధ పార్టీల నేతలూ హర్షం వ్యక్తంచేశారు.

**శాంతిని కోరిన దేశాలు**

భారత్, పాక్ సంయమనం పాటించాలని చైనా, సౌదీ అరేబియా, జి7 దేశాలు విజ్ఞప్తి చేశాయి. పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కూడా అంతర్గతంగా తమ దేశంపై ఒత్తిడి తీసుకువచ్చి, భారత్‌తో దౌత్యమార్గంలోనే ఉద్రిక్తత సడలించుకోవాలని తన సోదరుడు.. ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు పదేపదే సూచించారు. పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్‌తో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో ఫోన్లో మాట్లాడారు. సైనిక ఉద్రిక్తతలను తగ్గించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌తోనూ రూబియో ఫోన్‌లో మాట్లాడారు. భారత్ ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఆచితూచి వ్యవహరించిందని, అదే తీరును కొనసాగిస్తుందని జైశంకర్ ఈ సందర్భంగా చెప్పారు. భారత్‌పాక్‌లు సంయమనం పాటించాలని జి7 దేశాలు తొలుత పిలుపునిచ్చాయి. పహల్గాం ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయా దేశాల విదేశాంగ మంత్రులు ప్రకటన విడుదల చేశారు.

## దేశం కోసం ఏకమవుతాం

(మొదటిపేజీ తరువాయి)

'దేశమే ముందు.. మతాలు వేరైనా దేశం విషయానికొస్తే మనమంతా ఒక్కటే. భిన్నత్వంలో ఏకత్వం అనేది భారతావని బలం. మతాల మధ్య చిచ్చుపెట్టి, దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు దాయాది దేశం సహా ఎవరు కుట్రలు చేసినా ఎదురొడ్డి తీరతాం. సాయుధ దళాలకు, కేంద్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతుగా నిలుస్తాం, అంతా ఒక్కటై పని చేస్తాం' అని వివిధ మతాల పెద్దలు స్పష్టం చేశారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్నవేళ కేంద్రానికి, సాయుధ దళాలకు సంఘీభావం తెలిపేందుకు శనివారం గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన రాజ్‌భవన్‌లో సర్వమత సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉన్నతాధికారులు, వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు. దేశ రక్షణ, భవిష్యత్తు కోసం ప్రధాన మంత్రి, కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తామంతా అండగా ఉంటామని తీర్మానించారు.

**అనవసర ఉద్రిక్తతను నివారించాం**

'పహల్గాంలో 26 మంది పర్యాటకుల ప్రాణాలను తీసిన ఉగ్రవాదుల అనాగరిక చర్యను ప్రపంచమంతా ఖండించింది. ఆ దాడికి ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపైనే కచ్చితమైన దాడులు చేశాం' అని గవర్నర్ పేర్కొన్నారు. సాయుధ దళాలు ధైర్యం, వ్యూహాత్మకత, సంయమనంతో స్పందించాయని చెప్పారు. పాకిస్థాన్ సైనిక స్థావరాలు, మౌలిక సదుపాయాలపై ఎక్కడా భారత్ దాడి చేయలేదని గుర్తుచేశారు. అనవసర ఉద్రిక్తతను నివారించేలా, నిర్ణయాత్మకంగా 'ఆపరేషన్ సిందూర్'ను అమలు చేసిన విధానం మన బలాన్ని, బాధ్యతను ప్రదర్శించిందని ప్రశంసించారు. వీర జవాన్ల త్యాగాన్ని, అంకితభావాన్ని రాష్ట్ర ప్రజలు గౌరవిస్తున్నారని తెలిపారు.

**దేశం కోసం కలిసి నడవాలి**

'సైద్ధాంతిక విభేదాలుండవచ్చు. కానీ, దేశం విషయానికొచ్చేసరికి కుల మతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరూ ఏకమై అడుగు వేయాల్సిన బాధ్యత మనపై ఉంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'సరిహద్దుల్లో ఐదారు రోజులుగా నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నివారణలో త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయి. దేశం కోసం పనిచేస్తా, చనిపోతే జాతీయ జెండా కప్పుకొనే చనిపోతానని పట్టుదలగా సైన్యంలో చేరిన మన తెలుగుబిడ్డ మురళీనాయక్.. పోరాటంలో వీరమరణం పొందాడు. భారత్ ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోదు. మన ప్రజలను ఇబ్బంది పెడితే మాత్రం ఉపేక్షించబోమని ఆపరేషన్ సిందూర్‌తో మరోసారి చాటాం' అని తెలిపారు.

**సంఘటిత శక్తిని చాటతాం**

'మన సమైక్యతను దెబ్బతీయడానికే పహల్గాంలో ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం దేశాలు 55 ఉంటే భారత్‌లో ఉన్న స్వేచ్ఛా వాతావరణం ఎక్కడా లేదు. భారతీయులమని మాకు గర్వంగా ఉంది. మేమంతా దేశానికి మద్దతిస్తాం' అని సమావేశంలో పాల్గొన్న ముస్లిం మతపెద్దలు చెప్పారు. 'మతోన్మాదంతో దేశంలో అశాంతి, హింసను సృష్టిస్తూ అమాయకులను పొట్టనబెట్టుకునే ముష్కరులను హింసతోనైనా సరే ఎదుర్కోవాలి. మనలో విద్వేషాలు రెచ్చగొట్టి, విడగొట్టే ప్రయత్నం చేసినప్పుడు ధర్మయుద్ధం చేసి గెలవాలి' అని హిందూ మత పెద్ద అన్నారు. మన మత సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని కొనసాగించాలని, శాంతి కోసం అందరు దేవుళ్లనూ ప్రార్థిద్దామని క్రైస్తవ మత పెద్ద అన్నారు. సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు అండగా మనమంతా జాతీయ రక్షణ నిధి (ఎన్‌డీఎఫ్)కి విరాళాలిద్దామని సిక్కు మతపెద్ద సూచించారు. విద్రోహ శక్తుల అంతు చూస్తున్న సైన్యానికి కులమతాలకు అతీతంగా మద్దతుగా ఉంటామని బౌద్ధ సమాజ ప్రతినిధి చెప్పారు. ఉగ్రవాద వ్యతిరేక పోరుపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు చేయొద్దని గుజరాతీ సమాజ్ ప్రతినిధి కోరారు.

## ముగ్గురు మిత్రుల ఆఖరి ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

ముగ్గురు మిత్రుల ఆఖరి ప్రయాణం శుక్రవారం రాత్రి 11 గంటలకు దాన్ని తీసుకుని స్నేహితులను కలిసి వస్తానని చెప్పి వెళ్లాడు. కార్వాన్ విజయనగర్‌కాలనీకి చెందిన సంచయ్ మల్పానీ(22), ప్రగతినగర్‌కు చెందిన ప్రియాన్ష్ మిత్తల్(23)తో కలిసి కారులో శంషాబాద్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా ఘట్‌కేసర్ వైపు బయలుదేరాడు. అర్ధరాత్రి తర్వాత 2 గంటల సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి గండిచెరువు వంతెన సమీపంలోని రాగానే నిలిపి ఉంచిన సరకుల వాహనాన్ని గుర్తించకుండా వేగంగా ఢీకొట్టారు. కారు ముందు భాగం చొచ్చుకెళ్లడంతో మంటలంటుకున్నాయి. సరకుల వాహన డ్రైవర్ రెండు వాహనాలను వేరు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇతర వాహనదారులు కారులో మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు విశ్వప్రయత్నం చేశారు. దీపేశ్ అగర్వాల్, సంచయ్ మల్పానీ మంటల్లో సజీవ దహనమయ్యారు.

## బేషరతు కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించాల్సిన ఆవశ్యకతను వారు జెలెన్‌స్కీకి వివరించారు. ఉక్రెయిన్‌తో పాటు ఐరోపా దేశాల శాంతి, సుస్థిరతలకు ఇది అవసరమని పేర్కొన్నారు. సంధికి అంగీకరించి, శాంతి చర్చల ప్రక్రియ ప్రారంభమయ్యేలా రష్యాపైనా ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ మేరకు నాలుగు దేశాల నేతలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇదే విషయాన్ని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రీ సిబిహా కూడా నిర్ధారించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్లో జెలెన్‌స్కీ, నాలుగు ఐరోపా దేశాల నేతలు మాట్లాడిన తర్వాతే కాల్పుల విరమణ ప్రతిపాదన చేసినట్లు ఆండ్రీ వెల్లడించారు. అంతకుముందు... రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 80 ఏళ్లు అయిన సందర్భంగా కీవ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉక్రెయిన్ అధ్యక్షుడితో కలిసి ఫ్రాన్స్, జర్మనీ, పోలండ్, బ్రిటన్ నేతలు పాల్గొన్నారు.

## భారత్ సత్తా ప్రపంచానికి తెలిసింది

(మొదటిపేజీ తరువాయి)

గురితప్పకుండా పేల్చివేయటం భారత సైన్యానికే సాధ్యమైందన్నారు. దాడులకు ఎంచుకున్న లక్ష్యాన్ని విమానాలను గాని, సైనికులను గాని నష్టపోకుండా నూటికి నూరు శాతం సాధించటం ద్వారా సైన్యం తన సత్తాను నిరూపించుకుందని చెప్పారు. తక్కువ సమయంలో మనం అనుకున్నది సాధించినట్లు తెలిపారు. జొన్నలగెడ్డ చలపతి ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్చర్‌గా, టెస్ట్ పైలట్‌గా విధులు నిర్వహించారు. రఫేల్, తేజస్ యుద్ధ విమానాలపై అవగాహన ఉంది. శ్రీనగర్, అవంతీపొరా, పఠాన్‌కోట్, అమృత్‌సర్, ఆదంపూర్, అంబాలా, బఠిండా తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు, తాజాగా కాల్పుల విరమణకు అవగాహన కుదరటంపై, ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు...

*** పాకిస్థాన్ విషయంలో మన దేశం ఈసారి ఎందుకు కఠిన వైఖరి అవలంబించింది ?**

జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన 370 అధికరణాన్ని రద్దు చేసిన తర్వాత అక్కడ ఎంతో సానుకూలమైన పరిస్థితులు నెలకొన్నాయి. బాగా అభివృద్ధి జరుగుతోంది. ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరిగాయి. పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. మూడేళ్లలో 7.5 కోట్ల మంది సందర్శించారు. కానీ, పహల్గాం ఉదంతంతో మొత్తం మారిపోయింది. ఈ ఘటన దేశ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పక తప్పని పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వం అదే చేసింది. ఉగ్రవాదులను మన దేశం మీదకు ఉసిగొల్పితే ఉపేక్షించే ప్రసక్తే లేదనే విషయాన్ని పొరుగు దేశానికి స్పష్టంగా చెప్పటమే మన ప్రధాన లక్ష్యం. మరోసారి పహల్గాం లాంటి ఉదంతాలకు పాల్పడాలంటే భయపడే పరిస్థితి కల్పించాలని భారత్ భావిస్తోంది. అందుకే ఈసారి మరింత కఠినంగా వ్యవహరించింది. వాస్తవానికి మనం చేసిన దాడుల కంటే సింధూ జలాల ఒప్పందం నుంచి వైదొలగటం వల్ల పాకిస్థాన్‌కు ఎక్కువ నష్టం జరుగుతుంది.

*** చైనా ఇచ్చిన జే-10సి జెట్లతో మన రఫేల్ యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ ప్రకటించుకుంది. ఇందులో నిజమెంత ?**

ఏమాత్రం వాస్తవం కాదు. మీటియోర్ క్షిపణితో కూడిన రఫేల్ యుద్ధవిమానం అత్యంత ప్రమాదకరమైంది. దీని ముందు జే10సి వంటి ఒక తరం పురాతనమైన విమానాలు నిలవలేవు. సాంకేతికపరంగా, ఇతర అంశాల్లో రెండింటికీ పోలికే లేదు. మూడు రఫేల్ ఫైటర్లను కూల్చివేసినట్లు పొరుగు దేశం తప్పుడు ప్రచారం చేసుకుంటోంది.

*** తేజస్, ఏఎంసీఏ (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) వంటి స్వతంత్ర రక్షణ ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటి.. ఈ ప్రాజెక్టులు వేగం పుంజుకుంటాయా ?**

రక్షణ రంగంలో స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా చర్యలు తీసుకుంటోంది. తేజస్, ఏఎంసీఏ తదితర ప్రాజెక్టులకు పెద్దఎత్తున మద్దతు ఇస్తోంది. నిధులకు, ఆర్డర్లకు కొరత లేదు. ఒక రకంగా రక్షణరంగ సంస్థలకు ఇది స్వర్ణయుగం. అయితే, అందివచ్చిన అవకాశాన్ని ఈ సంస్థలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవటం లేదు. ఆర్డర్లను సత్వరం పూర్తి చేయడం లేదు. తేజస్ యుద్ధ విమానాల డెలివరీ ఎంతో ఆలస్యం అవుతోందని, ఇందులో ప్రైవేటు సంస్థలకు పాత్ర కల్పించటం మేలని ఇటీవల భారత వాయుసేన అధిపతి వ్యాఖ్యానించడం గమనార్హం. దీన్ని రక్షణ సంస్థలు గుర్తించాలి. ప్రాజెక్టులను నిర్దేశిత కాలంలో పూర్తి చేయటం ద్వారా దేశభద్రతలో భాగం కావాలి.

**ఈ మొత్తం వ్యవహారంలో చైనా పాత్ర ఏమిటి ?**

చైనా నుంచి మద్దతు ఉంటుందని పాకిస్థాన్ విశ్వసించింది. కానీ, ఆర్థికపరమైన అంశాల వల్ల ఈసారి చైనా పెద్దగా స్పందించలేదు. యూఎస్‌చైనా మధ్య 'ట్రేడ్ వార్' దీనికొక కారణం. అధిక పన్నుల వల్ల యూఎస్ మార్కెట్‌ను కోల్పోతే ఆర్థికంగా బాగా నష్టపోతుంది. ప్రత్యామ్నాయంగా భారత్ వంటి పెద్దదేశం కావాలి.

**పాకిస్థాన్ మళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడితే ఎలా స్పందించాలి ?**

మన సైన్యం చేసిన దాడుల్లో ఆ దేశ రక్షణ, కమ్యూనికేషన్ల వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. పాకిస్థాన్ బలహీనతలపై మనకూ అవగాహన వచ్చింది. వాళ్లు ఏం చేస్తున్నారో గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం కలిగింది. అంతేకాకుండా పహల్గాం ఉదంతానికి మన దేశం దీటుగా స్పందించటం వల్ల దేశ ప్రజల్లో విశ్వాసం, ధైర్యం ఏర్పడింది. జమ్మూకశ్మీర్‌ను సందర్శించటానికి భయపడాల్సిన అవసరం లేదనే నమ్మకం కలిగింది. కొద్ది రోజుల్లో గతంలో కంటే ఎంతో అధిక సంఖ్యలో జమ్మూకశ్మీర్‌కు పర్యాటకులు పోటెత్తటం ఖాయం. ప్రజలు అలాంటి సందేశం ఇవ్వాల్సిన అవసరం కూడా ఉంది.

*** భారత్, పాకిస్థాన్ వాయుసేన మధ్య సాంకేతిక సత్తా, నైపుణ్యాల విషయంలో ఎవరిది పైచేయి ?**

రెండు దేశాల మధ్య పోలికే లేదు. భారత వాయుసేనకు పాకిస్థాన్ ఎదురు నిలవలేదు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆ దేశంపై మన దేశం దాడికి దిగుతుందనేది అందరికీ తెలిసిపోయింది. పాకిస్థాన్ సైన్యం అన్ని రకాలుగా సన్నద్ధమైంది. అయినా ఎంచుకున్న ప్రదేశాల్లో భారత సైన్యం విజయవంతంగా దాడులు నిర్వహించింది. వంద శాతం లక్ష్యాన్ని సాధించింది. సాధారణంగా క్షిపణులు, శతఘ్నులు ప్రయోగించినప్పుడు కొన్నిసార్లు లక్ష్యానికి కాస్త అటూఇటూ తాకుతాయి. ప్రస్తుత దాడుల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని భారత వాయుసేన నూరు శాతం సాధించింది. పొరుగు దేశంలో ఎక్కడైనా, దేన్నైనా మనం ధ్వంసం చేయగలమని.. ఇందుకు అణ్వస్త్రాలు అవసరం లేదని, సంప్రదాయ ఆయుధాలతోనే చేయగలమని రుజువు చేశాం. ఇది పొరుగు దేశానికి గుణపాఠం లాంటిది. మన దాడులను అడ్డుకోలేకపోయారు. మరుసటి రోజు పాకిస్థాన్ నిర్వహించిన డ్రోన్ దాడులు, శతఘ్ని ప్రయోగాలను మన ఉపరితల రక్షణ వ్యవస్థ సమర్థంగా అడ్డుకుంది. తద్వారా మన దేశం సత్తా ప్రపంచానికి తెలిసింది.

## నేడు తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు

తన నివాసంలో ఫలితాలను విడుదల చేయనున్నారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో జరిగిన ఎప్సెట్ అగ్రికల్చర్ విభాగంలో 81,198 మంది, మే 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన ఇంజినీరింగ్ విభాగానికి 2,07,190 మంది హాజరయ్యారు.



# సిసి రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్ పేట,మే, 10(సమయం న్యూస్): అంబర్పేట నియోజకవర్గం లో బాగ్ అంబర్ పేట డివిజన్ సాయి మధుర నగర్ లో 22 లక్షల రూపాయలతో సిసి రోడ్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మరియు బాగ్ అంబర్ పేట కార్పొరేటర్ పద్మ వెంకటరెడ్డి తో కలిసి సాయి మధుర నగర్ లో 22 లక్షల రూపాయల తో సిసి రోడ్ పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్య క్రమంలో భాగంగా అధికారులు, బి.ఆర్.ఎస్ సీనియర్ లీడర్లు, మహిళా, బస్తి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంటిపై పోలీసులు దాడిని ఖండించిన జర్నలిస్టులు

బోధన్ పట్టణం, మే 10, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో సాక్షి దినపత్రిక చీఫ్ ఎడిటర్ ధనుంజయ్ రెడ్డి ఇంటిపై ఎలాంటి నోటీసులు లేకుండా పోలీసులు అక్రమంగా దాడులు జరిపిన ఘటనలను ఖండిస్తూ బోధన్ జర్నలిస్టులు శనివారం నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఏపీ రాష్ట్ర పోలీసులు దౌర్జన్యంగా చొరబడి సోదాలు నిర్వహించడం ఓ ఉగ్రవాది పట్ల వ్యవహరించిన తీరుగా ధనుంజయ్ రెడ్డిని బెదిరించిన పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఏపీ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎలుగెత్తి చాటుతున్న సాక్షి పత్రిక ప్రశ్నించే గొంతుని అనగదొక్కే



చర్యగా ఈ దాడినీ అభివర్ణింపబడేదిగా ఉందని, ఈ దాడిని పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న చర్యగా అభివర్ణించారు. అవినీతి, అక్రమాలు, ప్రభుత్వ వైఫల్యాలను వెలికితీసే పాత్రికేయులపై ప్రభుత్వం కక్ష సాధించడాన్ని తీవ్రంగా ఖండించారు. పత్రికా సంస్థలు అధికారం ఏ ప్రభుత్వానికి శాశ్వతం కాదనే విషయాన్ని పోలీసులు గుర్తించాలని పేర్కొన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిన హక్కుని వాటిని కాలరాస్తూ పోలీసులతో దాడులు చేయించడం తగదని తెలిపారు. ఏపీ కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను నిర్వీర్యం చేయడం సబబు కాదని, పోలీసులు ధనుంజయ్ ఇంటిపై నేరుగా దాడికి దిగడం సమర్థించదగిన పని కాదని స్పష్టం చేశారు. మీడియా స్వేచ్ఛకు ఇది నచ్చని మచ్చగా మిగిలి పోతుందని వారు హెచ్చరించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడడమే నిజమైన ప్రజాస్వామ్యానికి మూలస్థంభమని వారు పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని అన్నారు. ఈ నిరసనలో ప్రముఖ జర్నలిస్టులు తేళ్ల రవి, సూర్యప్రకాశ్, బండారి సాయిలు, తారాచంద్, కుర్షీద్ హసన్, ఉమాకాంత్, కారం స్వామి, రమేష్, జగన్, రాజేష్, విజయ్, అశోక్, లింబూరి లక్ష్మణ్, రాజేశ్వర్, అంజి బాబు, కడికే శివ, నాగభూషణం, శంకర్, పురాణే దిలీప్, అఫ్రోజ్, సాక్షి బోధన్ ఆర్ సి ఇంచార్జ్ గడ్డం గంగులు, సాక్షి టీవీ రిపోర్టర్ తోకల రవి, గణేష్, ఎన్ కృష్ణ, శ్రీనివాస్, అనిల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# కోతుల బెడద నుండి కాపాడేదేవరు

## జిన్నారం గ్రామ ప్రజల ఆందోళన

జిన్నారం, మే10 , సమయం న్యూస్ : మండల కేంద్రమైన జిన్నారం లో కోతల బెడద నుండి కాపాదేదేవరని గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో రోజు రోజుకు కోతలతో బాధలు వర్ణనాతీతం అని అన్నారు. ఇంట్లో ఉన్న మహిళలపై దాడులు చేస్తున్నాయి. గ్రామంలోని ప్రతి ఇంటి తలుపులు మూసి ఉంచాల్సిందే,ఒకవేళ మరచి తలుపులు తెరిచి వున్నాయంటే అంతే సంగతి,ఇంట్లో ఉన్న వస్తువులను పనికి రాకుండా చేస్తాయి.వాటిని ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే అవి మీద పడి కరుస్తున్నాయి.చిన్న పిల్లల ఆటలు ఆడుకోవడానికి బయటకు వెళితే పెద్దవాళ్లు వారిని కాపల కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గత నెల రోజులలో చాలామంది పిల్లలను కరిచాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామం లో పెంకుటిల్లుల పరిస్థితి దారుణంగా ఉంది,పైకప్పు పెంకులను తొలగిస్తూ చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గ్రామంలోని రైతులు ఏ పంటలు పండించిన కోతుల బాధ నుండి తప్పించుకోలేక పోతున్నామన్నారు. కోతుల పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో జిన్నారం గ్రామంలో గాని, పరిసర ప్రాంతాల్లో గాని వ్యవసాయం చేసే పరిస్థితి ఉండదని వారు తెలిపారు.ఇంటి పెరట్లో పెంచే పూల మొక్కలని ఉంచడం లేదంటే కూరగాయలు, ఆకుకూరలు పండించే రైతుల పరిస్థితి ఏమిటి అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నుండి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నాగ ప్రతిష్ట చేసి మొక్కు తీర్చుకున్న మైనంపల్లి

* ఘనంగా కొనసాగుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

గజ్వేల్, మే 10 : గజ్వేల్ మండలం దిలాల్పూర్ లోని స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో శనివారం మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేతుల మీదుగా నాగ ప్రతిష్ట చేశారు. గత ఏడాది లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం శనివారం ఆలయ ప్రాంగణంలో నాగ ప్రతిష్ట చేసి మొక్కు తీర్చుకున్నారు. కాగా గత రెండు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో తిరుమల రఘునాథ చార్యులు వైదిక నిర్వహణలో ప్రతిరోజు ఆలయంలో పురుష సూక్త సహిత మూలమంత్ర హవనములు నిర్వహిస్తున్నారు. ఆదివారం సుదర్శన హోమం, లక్ష్మీ నరసింహ స్వామికి శతఘటాభిషేకం, చక్ర స్నానం అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారి పుష్ప రథోత్సవం ఘనంగా జరగనుంది. ఆదివారం జయంతిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ కళ్యాణం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బురుజు కింది సంతోష్ రెడ్డి, కోశాధికారి అత్తెల్లి రాజేశం గుప్త, కార్యదర్శి రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి రాజిరెడ్డి, కొండల్ రెడ్డి,ముత్యం రెడ్డి, రవీందర్ రెడ్డి, లచ్చిరెడ్డి, రాష్ట్ర సర్పంచ్ ఫోరమ్ ల రాష్ట్ర కన్వీనర్ చిట్కుల్ మైపాల్ రెడ్డి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గాడిపల్లి రఘు వర్ధన్ రెడ్డి, ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, కొమ్ము విజయ్ కుమార్, కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఇక్బాల్, అనిల్ రెడ్డి, కృపానందం, రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్, కప్ప భాస్కర్, నాయిని తిరుపతి, ప్రవీణ్, జూనీ, రాజు, రవి గౌడ్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సార్వత్రిక సమ్మె 2025 విజయవంతం చేయండి

* కార్మిక సంఘాల జేఏసీ పిలుపు

బోధన్ పట్టణం, మే 10, సమయం న్యూస్ : మే 20, 2025న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను ఘనవైభవంగా నిర్వహించాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. టి.యు.సి.ఐ, సి.ఐ.టి.యు, ఐ.ఎఫ్.టియు, టి.ఎన్.టి.యు.సి, ఐ.ఎఫ్.టి.యు నాయకులు బి. మల్లేష్, జె. శంకర్ గౌడ్, పి. వరదయ్య, సి.హెచ్. హనుమంతరావు, డి. పోశెట్టి ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని పీఆర్టియు భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం సమ్మెకు సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, గత 11 సంవత్సరాల బీజేపీ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు దిగజారినట్లు, నిత్యావసరాల ధరలు భారీగా పెరిగినా, వేతనాల్లో పెరుగుదల లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలు చేపట్టిందని మండిపడ్డారు. నూతన లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనాల అమలు, కనీస 9,000 రూపాయల పెన్షన్ అమలు, పని గంటల పెంపుదల రద్దు వంటి డిమాండ్లతో జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 20న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. అన్ని రంగాల కార్మికులు భారీగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టి.యు.సి.ఐ నాయకులు డి. నాగేశ్వర్, టి. లాలు, జి. ప్రవీణ్, సిఐటియు నాయకులు గోపి తదితరులు పాల్గొన్నారు.




# ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిన BRS నాయకులు మారకపోవడం సిగ్గు చేటు

* మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బెజ్జనబోయిన అనిల్

తోగుట, మే 10 (సమయం న్యూస్) : తోగుట మండలం వెంకటరావుపేట గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ దుబ్బాక అభివృద్ధి ప్రదాత చెరుకు ముత్యం రెడ్డి గారి కుమారుడు దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి మీకు లేదు మాట్లాడే ముందు మీ స్థాయి ఏంటో చూసుకోవాలని హెచ్చరించారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎక్కడ చూసినా దివంగత నేత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి చేసిన పనులే తప్ప మీరు తొమ్మిది ఏండ్లలో చేసింది ఏమీలేదని ఎన్నికల ముందు కత్తి పోటు రాజకీయం చేసి ఓటుకు 2000 రూపాయలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి గెలిసిన మీరు శ్రీనివాస్ రెడ్డి పై చేసిన అనుచిత వాక్యాలు వెనుకి తీసుకోకపోతే ముందు ముందు ప్రజలలో తిరగలేరు అని హెచ్చరించారు. గత బిఆర్ఎస్ పాలనలో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా చేసి రాష్ట్రాన్ని కుదేలు చేశారని ఒకవైపు గతంలో మీరు చేసిన అప్పులను ఒక్కొక్కటిగా సెట్ చేస్తూ మరోవైపు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తున్న ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఇంత గొప్ప సంకల్పం తో ముందుకు సాగుతున్న ప్రజా ప్రభుత్వాన్ని బదునామ్ చేసి ప్రజలలో మెప్పు పొందాలి అని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు.



# ఐపీఎల్ మళ్లీ ఎప్పుడు?.. నేడు బీసీసీఐ నిర్ణయం

భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదరడంతో ఐపీఎల్ పునరుద్ధరణపై బీసీసీఐ దృష్టిపెట్టింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్‌ను బోర్డు వారం రోజులు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. పరిస్థితులు మారిన నేపథ్యంలో తిరిగి లీగ్ ప్రారంభించడంపై ఆదివారం చర్చించనున్నట్లు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా చెప్పాడు. ''యుద్ధం ఆగిపోయింది. బీసీసీఐ ఆఫీస్ బేరర్లు, అధికారులు, ఐపీఎల్ పాలకవర్గం ఆదివారం చర్చించి లీగ్‌పై ఓ నిర్ణయం తీసుకుంటారు. టోర్నీని పూర్తి చేయడానికి అత్యుత్తమ షెడ్యూలు ఏదో చూస్తాం'' అని అన్నాడు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లో మిగిలిన మ్యాచ్‌లను నిర్వహించాలని అంతకుముందు వచ్చిన వార్తలపై శుక్లా స్పందిస్తూ.. ''అది యుద్ధం జరుగుతునప్పుడు అనుకున్నది. ఇంకా చాలా ప్రత్యామ్నాయాల గురించి మేం చర్చించాం. ఇప్పుడే కాల్పుల విరమణను ప్రకటించారు. మాకు కొంచెం సమయమివ్వండి. మేం చర్చిస్తాం. ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటాం'' అని చెప్పాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో ఇంకా 16 మ్యాచ్‌లు జరగాల్సివుంది. మేలోనే ఐపీఎల్‌ను పూర్తి చేయాలని బీసీసీఐ నిర్ణయిస్తే... విదేశీ ఆటగాళ్లను వెనక్కి రప్పించడం పెద్ద సవాలే. ఐపీఎల్ వెంటనే ఆరంభమైతే వెళ్లిపోయిన విదేశీ ఆటగాళ్లు తిరిగొస్తారన్న గ్యారెంటీ లేదు. విదేశీ ఆటగాళ్ల ప్రయాణం: పాకిస్థాన్, భారత్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్‌ను వారం రోజుల పాటు సస్పెండ్ చేయడంతో విదేశీ ఆటగాళ్లు, సహాయ సిబ్బంది భారత్‌ను వీడుతున్నారు. ఇప్పటికే చాలా మంది స్వదేశానికి వెళ్లారు. ''మా ఆటగాళ్లు, సహాయ సిబ్బంది బెంగళూరుకు సురక్షితంగా చేరుకున్నారు. అక్కడి నుంచి వాళ్లు తమ సొంత నగరాలకు, దేశాలకు వెళ్లిపోతున్నారు'' అని రాయల్ ఛాలెంజర్ బెంగళూరు ఓ ప్రకటనలో పేర్కొంది. ఆర్సీబీ జట్టులో టిమ్ డేవిడ్, లివింగ్‌స్టన్, జాకబ్ బెతెల్, రొమారియో షెఫర్డ్, ఫిలిప్ సాల్ట్, హేజిల్‌వుడ్, ఎంగిడి, తుషార వంటి విదేశీ క్రికెటర్లు ఉన్నారు. కోచ్ ఆండీ ఫ్లవర్, బౌలింగ్ కోచ్ గ్రిఫిత్, క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ బొబాట్, ఫిజియో ఎవాన్ స్పీచ్‌లీ ఆర్సీబీ సహాయ సిబ్బందిలోని విదేశీయులు. తమ జట్టులోకి కొందరు విదేశీ క్రికెటర్లు స్వదేశానికి వెళ్లిపోయారని లఖ్‌నవూ కూడా తెలిపింది. ఇతర ఫ్రాంఛైజీల్లోని విదేశీయులూ స్వదేశీ బాట పట్టారు.





## సైనికుల క్షేమాన్ని కాంక్షిస్తూ...
# వర్గల్ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



గజ్వేల్, మే 10: సైనికుల క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో వేద పండితులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్ర శేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ ధర్మం వైపు నిలిచిన భారతావనిదే విజయమని స్పష్టం చేశారు. ముఖ్యంగా శ్రీ విద్యాధరి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు, కృపాకటాక్షాలు దేశ సైనికులు, ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. పాక్ ఉగ్రమూకల దాడికి ప్రతిఘటనగా దేశ ఆర్మీ చేపట్టిన "ఆపరేషన్ సింధూర్" చారిత్రాత్మకంగా నిలిచి విజయ పరంపర కొనసాగిస్తుందని తెలిపారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో పాలకులు తీసుకునే నిర్ణయాలకు, దేశ ఆర్మీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. దేశ సంక్షేమం, సైనికుల సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు వర్గల్ క్షేత్రంలో ప్రతినిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిద్ధాంతి చంద్రశేఖర శర్మ వివరించారు.



# శ్రీరామ పాదుకలకు క్షీరాభిషేకం

* **అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

బోధన్ పట్టణం, మే 10, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో ఉన్న శ్రీ నగరేశ్వర, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ పంచపటిక్షేత్ర వ్యవస్థాపక ధర్మకర్త రామ్ రామ్ గురూజీ నేతృత్వంలో శనివారం ఉదయం భక్తిశ్రద్ధలతో శ్రీరామ పాదుకలకు క్షీరాభిషేకం నిర్వహించడం జరిగింది. అనంతరం పాదుకులకు విశేష పూజలు నిర్వహించి, మంత్రపుష్పాలు, ఫల నైవేద్యాలు, మంగళ నీరాజనాలు నిర్వహించి కుసుమాదక్షతలు సమర్పించారు. అలాగే రామ నామ సంకీర్తనలు, రామనామ భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ రామ్ గురూజీ మాట్లాడుతూ రాముడు ఈ జగత్తుకి ఆదర్శప్రాయుడని, అనుక్షణం శ్రీరామ నామ స్మరణ, జపంతో అష్టైశ్వర్యాలు, సర్వ సుఖాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రముఖులు కొత్త రాజేశ్వర్ , కంటాల రమేష్, పార్శి శ్రీధర్ , గంది రాజేశ్వర్ , నాగ దుర్గ , కొత్త పద్మావతి ,రమాదేవి, సోలాపూర్ వాసుశ్రీ , అనురాధ తదితర ప్రముఖులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించడం జరిగింది. ఆలయ కమిటీ తరపున రామ్ రామ్ గురూజీని కొత్త రాజేశ్వర్ ఘనంగా సన్మానించారు.



# బ్యాంకు లింకేజీ లేకుండా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

* **ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రితమ్ కు విన్నవించిన**
* **ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింలు**

రాయపోల్, మే10, సమయం న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా మంజూరయ్యే రుణాలను బ్యాంకు లింకేజీ పై ఆధారపడకుండా నేరుగా కార్పొరేషన్ నుంచే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింలు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రితమ్ కు విన్నవించారు. శనివారం తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరికరి ప్రీతం ను హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల జీవనోపాధి స్థిరపడాలంటే బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకులు బలహీనమైన క్రెడిట్ స్కోర్ ను ఆకారణంగా చూపడం, బీమా లేదా గ్యారంటీని అడగడం, లబ్ధిదారులపై నమ్మకం లేకపోవడం, ఫైళ్లను నెలల తరబడి ఆపడం , బ్యాంకు అధికారుల ఆమోదం, సివిల్ స్కోర్ వంటి కారణాలు చూపుతూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బ్యాంకుల ద్వారా కాకుండా కార్పొరేషన్ల ద్వారా నే రుణాలు మంజూరు చేయాలని చైర్మన్ ప్రీతమ్ ను కోరడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, సీనియర్ నాయకులు భాను ప్రసాద్, కొక్కొండ రవీందర్ తదితరులున్నారు.

# యుద్ధం.. ప్రపంచానికి భారమే!

'యుద్ధాన్ని ప్రపంచం భరించలేదు' భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ డిప్యూటీ ప్రతినిధి ఫర్హాన్ హక్ ప్రకటన ఇది. ఆయన ప్రకటన వెనక ఎంతో అంతరార్థం దాగి ఉంది. ఇప్పటికే గాజా ఇజ్రాయెల్, ఉక్రెయిన్ రష్యా మధ్య నెలలు, సంవత్సరాలుగా యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నాయి. తీవ్ర ఆస్తి, ప్రాణనష్టం సంభవిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యంపైనా తీవ్ర ప్రభావం పడింది. అనేక వస్తువుల ధరలు తీవ్రంగా పెరిగాయి. ఇది నిరుపేదలు, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారాయి. లక్షలాది కుటుంబాల ఆర్థిక పరిస్థితులు తలకిందులయ్యాయి. ఈ నేపథ్యంలో భారత్ పాకిస్తాన్ యుద్ధం మొదలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా అస్థిరత ఎదుర్కొనే ప్రమాదముంది. ప్రపంచ అనేక దేశాల ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలోనే అనేక దేశాల అధినేతలు యుద్ధ పరిస్థితులపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

*** ప్రపంచ దేశాల్లో ఆందోళన**

రష్యా ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక అంశాలపై ప్రభావం పడింది. రెండు దేశాల్లో ఉత్పత్తి అయ్యే వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. యుద్ధం వల్ల గ్లోబల్ ద్రవ్యోల్బణం 23% పెరిగింది. రష్యా, ఉక్రెయిన్ గోధుమల సరఫరాలో 25 శాతం వాటాను కలిగి ఉన్నయి. అయితే యుద్ధం వల్ల 40 50 శాతం ధరలు పెరిగి ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఆహార సంక్షోభం సైతం ఏర్పడింది. పామాయిల్ ధరలు 40 50% పెరిగాయి, ఎరువుల ధరలు సైతం 30% పెరిగి వ్యవసాయ ఖర్చులు భారమయ్యాయి. అయితే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంతో కొన్ని నెలల తర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. కానీ అప్పటికే ప్రజలపై తీవ్ర ప్రభావం పడింది. ఇండియాపాకిస్తాన్ యుద్ధం కొన్ని వారాలపాటు కొనసాగినా దాని ప్రభావం వివిధ అంశాలపై పడుతుందని ప్రపంచదేశాలు ఆందోళన చెందుతున్నాయి.

**ఎగుమతులు, దిగుమతులపై..**

భారతదేశం ప్రస్తుతం 4.27 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. ఇండియా ఐటీ, ఫార్మా, వ్యవసాయం, టెక్స్ టైల్స్, ఆటోమొబైల్ రంగాల్లో ప్రధాన ఎగుమతిదారు. ప్రపంచంలో 40 శాతం బియ్యం సరఫరాలో ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద ఎగుమతి దారు. 10 శాతం సరఫరాతో పాకిస్తాన్ నాలుగో స్థానంలో ఉంది. అయితే ఒక వేళ యుద్ధం వల్ల ఓడరేవులు, రవాణా మార్గాలకు అంతరాయం కలిగితే మలేషియా, సింగపూర్, సౌదీ అరేబియా, యూఏఈ, బంగ్లాదేశ్, ఇండోనేషియాతోపాటు మరికొన్ని దేశాల్లో 20 నుంచి 30 శాతం బియ్యం ధరలు పెరగవచ్చు. ఆహార ద్రవ్యోల్బణం 510% పెరగవచ్చు. ఆసియాలోని దేశాల్లో చమురు ధరల్లో కూడా అస్థిరత ఉండవచ్చు. ఉల్లిపాయలు, ఔషధాల సరఫరా, టెక్స్ టైల్స్, ఐటీ సేవలపైనా ప్రభావం పడుతుంది. ఇండియా నుండి జెనెరిక్ ఔషధాలు దిగుమతి చేసుకునే నైజీరియా, కెన్యా, దక్షిణాఫ్రికా వంటి ఆఫ్రికా దేశాల్లో ఔషధ ధరలు 2030% పెరగడం వల్ల ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదముంది. బియ్యం కొరత ఆహార సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది. ఇండియా నుంచి ఐటీ సేవలు, టెక్స్ టైల్స్, ఫార్మా ఎగుమతులు ఆగిపోతే అమెరికా, యూరప్ దేశాల్లో సాఫ్ట్ వేర్ డెవలప్మెంట్ ఖర్చులు, దుస్తులు, ఔషధ ధరలు 515% పెరగవచ్చు. చైనా ఇండియా నుండి రసాయనాలు, ఫార్మా మూలవస్తువులను దిగుమతి చేసుకుంటుంది. యుద్ధం వల్ల ఈ సరఫరా ఆగిపోతే చైనా ఔషధ ఉత్పత్తి ఖర్చులు పెరగవచ్చు.

**స్టాక్ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం**

భారత్ పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పూర్తిస్థాయి యుద్ధంగా మారితే వివిధ దేశాల్లో స్టాక్ మార్కెట్లపైన తీవ్ర ప్రభావం పడి మదుపరుల సంపద ఆవిరి అయ్యే ప్రమాదమున్నది. పహెల్గాం దాడి తర్వాత జరిగిన పరిణామాలతో పాకిస్తాన్ కు చెందిన కరాజీ స్టాక్ ఎక్స్ చేంజ్ 13 శాతానికి పైగా పడిపోయింది. ఆ దేశంలో కొన్ని రోజుల్లోనే 80 వేల కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. భారత స్టాక్ మార్కెట్లు స్థిరంగానే ఉన్నా.. శుక్రవారం నిఫ్టీ 250 పాయింట్లకు పైగా, సెన్సెక్ 800 పాయింట్లకు పైగా నష్టపోయాయి. అయితే ప్రస్తుతం భారత్ దగ్గర ఆర్థిక బలం ఎక్కువ. ఈ క్షీణత తాత్కాలికమేనని గతంలో ఎన్నో ఉదాహరణలు రుజువు చేశాయి. చైనా పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ లో చైనా ఇప్పటికే భారీ పెట్టుబడులు పెట్టింది. యుద్ధం జరిగితే, ఈ పెట్టుబడులపై రిస్క్ పెరుగుతుంది, ఇది చైనా స్టాక్ మార్కెట్ లో స్వల్పకాలిక అస్థిరతను కలిగించే అవకాశముంది. ఐటీ, ఫార్మా రంగాల్లో అమెరికాకు భారత్ కీలక సరఫరాదారు. యుద్ధం వల్ల ఈ సరఫరాలకు ఆటంకం ఏర్పడితే, అమెరికన్ టెక్, హెల్త్ కేర్ స్టాక్లపై స్వల్ప ప్రభావం పడవచ్చు. యూరప్ లోనూ దీని ప్రభావం ఉండొచ్చు. బంగ్లాదేశ్ టెక్స్ టైల్ ఎగుమతులు ఇండియాపై ఆధారపడతాయి. వాణిజ్యానికి అంతరాయం ఏర్పడితే ఆ దేశ టెక్స్ టైల్ స్టాక్లు దెబ్బ తినొచ్చు.

**పాకిస్తాన్ అత్యుత్సాహంతో..**

పహెల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో భారతదేశం సర్జికల్ స్ట్రైక్ చేపట్టింది. ఉగ్రవాద కేంద్రాలను టార్గెట్ గా చేసుకొని దాడి చేసింది. సంయమనం పాటించాల్సిన పాకిస్తాన్ అత్యుత్సాహం చూపింది. రెచ్చగొట్టేలా ఇండియాలోని పలు చోట్ల డ్రోన్లతో దాడులు చేయడానికి ప్రయత్నించడంతో మళ్లీ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నది. కేవలం 348 బిలియన్ డాలర్లతో అత్యంత బలహీనంగా ఉంది. 130 బిలియన్ డాలర్ల రుణంలో కూరుకుపోయి ఉంది. ఫారెక్స్ రిజర్వు నిల్వలు సైతం అతి తక్కువగా ఉన్నాయి. ఐఎంఎఫ్ బెయిలౌట్లపై ఆధారపడుతున్నది. భారత్ తీసుకున్న చర్యలకు ప్రతిగా ఇండియా నుంచి దిగుమతులను నిషేధించింది. ఇది ఆ దేశ వైద్యరంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ప్రస్తుతం అక్కడ అత్యవసర మందులు దొరకని పరిస్థితి నెలకొన్నది. యుద్ధ భయాల నేపథ్యంలో పాకిస్తాన్ ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. యుద్ధం వస్తే ఆ దేశ పరిస్థితి మరింత దిగజారుతుంది. పాకిస్తాన్ రూపాయి మరింత పడిపోతుంది. నీటి కొరతతోపాటు గోధుమలు, బియ్యం, కూరగాయల ధరలు పెరుగుతాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ ధరలు ఆకాశాన్నంటుతాయి. ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్న ధరలను భరించడం అక్కడి ప్రజలకు కష్టతరంగా మారింది. కొన్ని నివేదికల ప్రకారం ఆ దేశం వద్ద సైనిక వనరులు కూడా కొన్ని రోజులకు సరిపడా మాత్రమే ఉన్నాయి. అంతేకాకుండా ప్రపంచదేశాలు సైతం పాకిస్తాన్ ను దోషిగానే చూస్తున్నాయి. అక్కడి ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఐఎంఎఫ్ సహాయం, అంతర్జాతీయ సహకారం మరింత సంక్లిష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో పాకిస్తాన్ అక్కడి దేశ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మౌనంగా ఉండడమే మంచిది. అత్యుత్సాహానికి వెళ్లి భారత్ ను రెచ్చగొడితే ఆ దేశం తీవ్ర నష్టం ఎదుర్కోక తప్పదు. ఈ విషయం అక్కడి ప్రభుత్వానికి, ఆర్మీకీ తెలుసు. అయినా అలాగే వ్యవహరిస్తున్నారంటే ఆ దేశ పాలకులకు అక్కడి ప్రజల పట్ల ఏ మాత్రం చింత, పట్టింపు లేదని అర్థమవుతున్నది.



ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9640466464

# ప్రజలు ఐక్యమై శత్రుమూకలను తరిమి కొట్టాలి

* **పాకిస్తాన్ ఉగ్రవాదం తీరు సహించరానిది**
* **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**
* **పాక్ ఉగ్రవాదంపై "పాకిస్తాన్ ఖబడ్దార్" అనే సిడి ఆవిష్కరణ**
* **ఉగ్రవాదంపై కన్నెర్ర చేసి పాటలు ఆలపించిన మద్దెల శివకుమార్కు అభినందనలు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 10(సమయం న్యూస్): కొత్తగూడెం కళామతల్లి ముద్దుబిడ్డ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ స్వీయ రచన గానం సమర్పణలో రూపుదిద్దుకొని పాకిస్తాన్ ఉగ్రవాదంపై కథం తొక్కిన" పాకిస్తాన్ ఖబడ్దార్" అనే నూతన గీతాన్ని సిడి ఆవిష్కరణ కార్యక్రమం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా జరిగింది. శనివారం అశ్వరావుపేటలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల స్వీయ రచన, గానం సమర్పణతో రూపుదిద్దుకున్న పాకిస్తాన్ ఖబర్దార్ అనే నూతన గీత సిడి ఆవిష్కరణ అనంతరం డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశ విపత్కర పరిస్థితిలో కళాకారులు కవులు అన్ని వర్గాల ప్రజలు, సంఘటితమై శత్రుమూకలను తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మానవత్వాన్ని మంట కలిపి మతవిద్వేశంతో భారతదేశ సమైక్యతను అస్థిర పరచాలని దొంగ దాడులు చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని ఈ విపత్కర పరిస్థితిలో కళాకారులు కవులు ముందుకు వచ్చి ప్రజలను మరింత చైతన్యం చేయాలని అన్ని వర్గాల ప్రజలు సంఘటితశక్తిగా ఏకతాటిపై మన దేశానికి వెన్నుదన్నుగా నిలిచి మన సైనికులలో ఆత్మ స్థైర్యాన్ని నింపి శత్రు మూకలను తరిమికొట్టాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రముఖ కొత్తగూడెం కళాకారుడు కవి సినీగీత రచయిత గాయకుడు సమాజసేవకుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ తనకు అత్యంత సన్నిహితుడైన కళాశాల మిత్రుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఒకడుగు ముందుకు వేసి కళాకారుడిగా తన గురుతర బాధ్యతతో "పాకిస్తాన్ ఖబర్దార్ "అనే చక్కని గీతాన్ని స్వయంగా రచించి ఆలపించి సమర్పించినందుకు వారికి అభినందనలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయకులు ఆచార్య డాక్టర్ మద్దెల శివ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంతోటి పాల్, కోటేశ్వరరావు, అంబేద్కర్ యువజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల సాయి సుధీర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఈ గీతానికి సంగీత సహకారాన్ని ప్రముఖ సంగీత దర్శకులు మారపాక కృష్ణస్వామి, సౌండ్ సిస్టం రికార్డింగ్ సహకారాన్ని వర్ధమాన సినీ దర్శకులు రచయిత బండి సుభాకర్, సిడి రూపకల్పనలో సాగర్ డిజిటల్స్ అధినేత శ్రీలక్ష్మి, రెయిన్బో ఫ్లెక్సీ అధినేతలు అజయ్, లక్ష్మణ్, డైమండ్ స్టిక్కరింగ్ శ్యామ్, మద్దెల అభిషేక్, మద్దెల ఆదర్శ్, మద్దెల సాయి సుధీర్ తదితరులు ప్రత్యేక సహకారాన్ని అందించారు. వీరందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లుగా మద్దెల శివకుమార్ పేర్కొన్నారు.

# ఓటమిని జీర్ణించుకోలేకనే ఎమ్మెల్యే పై చెరుకు అనుచిత వ్యాఖ్యలు

* **మండల బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి**



తొగుట మే 10 (సమయం న్యూస్) : శాసనసభ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయి, ఓటమిని జీర్ణించుకోలేకనే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి విమర్శించారు. వెంకట్రావుపేట లో పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడుతూ చెరుకు శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ లో ఏసీబీ దాడులలో హోమ్ గార్డు పట్టుబడ్డ నేపథ్యంలో అనుమానాలున్నాయని, విచారణ చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఒక ఎమ్మెల్యేగా వ్యవస్థలో పొరపాటు జరిగితే ప్రశ్నించే హక్కు లేదా అని ఆయన ప్రశ్నించారు. మద్యం సేవించి తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, యువకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, బెల్ట్ షాప్ లు నియంత్రించాలని ఎమ్మెల్యే కోరితే నాటి, నేటి బెల్ట్ షాప్ ల లెక్కల గురుంచి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, తాము అధికారం లోకి వొస్తే బెల్ట్ షాప్ లు తొలగిస్తామని మీరు హామీ ఇవ్వలేదా అని అన్నారు.ఎన్నికల్లో డబ్బుల పంపిణీ గురుంచి మీరు మాట్లాడటం చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందన్నారు..ఎన్నికల్లో బోలెడు హామీలు ఇచ్చి అధికారం లోకి వొచ్చిన మీరు హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారు అని మండిపడ్డారు. నాయకులు బండారు స్వామి గౌడ్, పాత్కుల బాలేష్, పిట్ల వెంకటేష్, ఎంగలి నరేందర్, సుతారి రాంబాబు, బెజ్జనమైన కృష్ణ తదితరులు ఉన్నారు.

# విద్యార్థులను అభినందించిన డైరెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే10(సమయం న్యూస్): కొత్తగూడెం సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో చదువుతూ పదో తరగతి ఫలితాల్లో టాపర్ గా నిలిచిన ఐదుగురు విద్యార్థులను సింగరేణి డైరెక్టర్(పా) సొసైటీ అధ్యక్షులు శనివారం వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా సింగరేణి స్కూల్లో పదవ తరగతి చదివిన 500 మంది విద్యార్థులలో 53 మంది విద్యార్థులకి 500 పైగా మార్కులు సాధించారని సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జి.శ్రీనివాస్ డైరెక్టర్కు వివరించారు. అస్మిత సింగరేణి పాఠశాలలో అన్ని



పాఠశాలల్లో కల్లా అత్యధిక మార్కు సాధించి మొదటి స్థానంలో నిలిచిందని వివరిస్తూ పేర్కొన్నారు. కొత్తగూడెం పాఠశాల విద్యార్థులలో ఆలియా తన్వీర్, సనా, విశాల్, యువన్, వర్ధన్ విద్యార్థులను అభినందించారు. వారి ఉన్నత చదువులకు ఆశీర్వదించడం జరిగింది. రాబోయే 2025..2026 ఎకడమిక్ ఇయర్లో సింగరేణి పాఠశాలలో అత్యుత్తమ ఫలితములు సాధించాలని అందుకు ప్రణాళిక చేయాలని డైరెక్టర్ సెక్రెటరీని ఆదేశించడం జరిగింది. పాఠశాలల్లోని బోధన సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సింగరేణి పాఠశాలలో అత్యుత్తమ విద్య అందించాలని సూచించారు. యాజమాన్యం తరుపున సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చైర్మన్ విద్యకు అత్యుత్తమ ప్రాధాన్యం ఇస్తారని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి సునీల్ కుమార్, సింగరేణి కొత్తగూడెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాయి సుజాత, సీనియర్ ఉపాధ్యాయుడు ప్రతాప్ పూల్ సింగ్ పాల్గొన్నారు.



# మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

- **మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం**
- **కార్మిక హక్కులను కాపాడుకుందాం**
- **చేతి వృత్తి దారుల సంఘం రాష్ట్ర కన్వినర్ పైళ్ల ఆశయ్య**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 10 సమయం న్యూస్: మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని చేతి వృత్తి దారుల సంఘం రాష్ట్ర కన్వినర్ పైళ్ల ఆశయ్య కోరారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని చార్వక హాల్ లో శనివారం ప్రజా సంఘాల సమావేశం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చేతి వృత్తి దారుల సంఘం రాష్ట్ర కన్వినర్ పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, ప్రజలు, రైతులు, ఆదివాసి గిరిజనులపై పెద్ద ఎత్తున దాడి చేస్తుందని, బ్రిటిష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి, ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్నారు. ఉపాధి కూలీలకు జీతాలు పంచడం లేదని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, ఆదివాసి గిరిజన, పేదల సాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వడంలేదని, చేతి వృత్తులు చేసుకునేటటువంటి ప్రజలందరికీ సామాజిక భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్, పెట్టుబడుదారులకు అనుకూలంగా లేబర్ కోడ్ లు తెచ్చిందని అన్నారు. కార్మికుల హక్కుల రక్షణకై జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ లో ప్రజా సంఘాలన్నీ మద్దతూ తెలియజేస్తున్నాయని, కార్మికులు, ప్రజలు, రైతులు, ఆదివాసి గిరిజనులు మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సంకె రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కనికారపు అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, రజక సంఘం జిల్లా కార్యదర్శి పైరాల రాములు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎర్మ పున్నం, వృత్తిదాల సంఘం జిల్లా కార్యదర్శి బోడంకి చందు, ఆదివాసీ సంఘం నాయకులు మల్లేశ్వరి, ఎస్కే అబ్దుల్లా, సమ్మక్క, రమేష్, గోమాస ప్రకాష్, జిల్లా సీఐటీయు ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, అంబటి లక్ష్మణ్, సిఐటియు జన్నారం మండల కన్వీనర్ కొమ్ముల రజిత, రాజమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

# అధునాతన వైద్య పరికరాలతో మెరుగైన వైద్యం

- **టచ్ ఆసుపత్రి కార్డియోలాజిస్ట్ డాక్టర్ బి రాజేష్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 10 సమయం న్యూస్: గుండె నొప్పితో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు అధునాతన వైద్య పరికరాలతో మెరుగైన వైద్యం అందించి, కాపాడటం జరిగిందని టచ్ ఆసుపత్రి కార్డియోలాజిస్ట్ డాక్టర్ రాజేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని టచ్ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి యాజమాన్యం, కార్డియోలాజిస్ట్ డాక్టర్ బి రాజేష్ మాట్లాడుతూ, సరోజ అనే మహిళా తీవ్రమైన ఛాతి నొప్పితో ఆసుపత్రికి రాగా, ఆమెను ఆసుపత్రి కార్డియోలాజిస్ట్ డాక్టర్ రాజేష్, వైద్య బృందం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి, హార్ట్ ఎటాక్



వచ్చిందని నిర్ధారించారు. వెంటనే బంధువుల అంగీకారంతో ఆంజియోగ్రాం పరీక్ష నిర్వహించగా, అందులో గుండె లోని మెయిన్ రక్తనాళం లో మొదటి భాగంలో 95 శాతం బ్లాకేజ్ ఉండటం జరిగిందని గుర్తించారని, దీనిలో స్టంట్ వేయడం చాలా కష్టమని, మామూలుగా ఓపెన్ హార్ట్ సర్జరీకి పంపిస్తారని, కానీ టచ్ ఆసుపత్రిలో ఐవియూఎస్ కెమెరా గైడింగ్ అనే ఆధునాతనమైన చికిత్సతో, ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా స్టంట్ వేయడం జరిగిందని వివరించారు. దీంతో రోగి, బంధువులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. హార్ట్ ఎటాక్ అనేది అత్యవసర వైద్య పరిస్థితి అని, ఇది సమయానికి సరైన చికిత్స అందించక పోతే ప్రాణాంతకం కావచ్చునన్నారు. హార్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే ఆసుపత్రికి చేరుకోవడం ఎంత ముఖ్యమని వివరించారు. హార్ట్ ఎటాక్ పేషంట్లకి సమయం ఎంత విలువైనదని, దానిని వృధా చేయకుండా ఇలాంటి అధునాతమైన వైద్య సేవలు కోసం దూర ప్రాంతాలు వెళ్లాల్సిన అవసరం లేదని, మంచిర్యాల లోని టచ్ ఆసుపత్రిలో అన్ని రకాల అధునాతమైన వైద్య సేవలు ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాలు తుది దశకు చేరుకున్నాయి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాల్ పల్లె మే10( సమయం న్యూస్) : కాలేశ్వరంలో సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయని, సరస్వతి పుష్కరాల ప్రారంభానికి ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలుండటంతో శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే ఘాట్, సరస్వతి మాతా విగ్రహం, జ్ఞాన దీపం, స్టాళ్లు, పుష్కర స్నానాలు ఆచరించే నది ప్రాంతం, పారిశుధ్య ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాట్లు వంటి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కొద్ది రోజులు. మాత్రమే సమయం ఉన్నందున రేయింబవళ్లు పనులు జరగాలని అధికారులను కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. సరస్వతి మాతా విగ్రహం పూలతో ముస్తాబు చేయాలని సూచించారు. పటిష్ట బారికేడ్లు ఏర్పాటు చేయాలని, భక్తులు నదిలోకి వెళ్లకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ పనులన్నింటిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే నిరంతరం పర్యవేక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు, మార్గదర్శకాలు అందిస్తున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల సమన్వయంతో ఏర్పాట్లు వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్



పేర్కొన్నారు. సరస్వతి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, దేవాదాయ, పంచాయతి రాజ్, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తాం

- **ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**
- **సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (పా) తో సమీక్ష**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 10(సమయం న్యూస్): నల్ల బంగారాన్ని వెలికితీస్తూ శ్రమిస్తున్న సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తామని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అభయమిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయానికి ఎంపీ వెళ్లి ఆ సంస్థ డైరెక్టర్(పా)కే.వెంకటేశ్వర్లు, జీఎం, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల కొరత లేకుండా చూడాలని కార్మికులకు విధి నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ పరంగా సింగరేణికి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైల్వే పనుల జాప్యంపై ఎంపీ ఆగ్రహం

- **త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 10 (సమయం న్యూస్):కొత్తగూడెం రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేయడంలో జరుగుతున్న ఆలస్యంపై ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన రైల్వే స్టేషన్ ను సందర్శించి జరుగుతున్న ఆధునికరణ పనులపై ఆరా తీశారు. అనుకున్న సమయంలో పనులు జరగకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి గుత్తేదారుకు ఫోన్ చేసి పనులు ఎంత వరకు పూర్తయ్యాయని ఎందుకు పనులు ఆలస్యంగా నడుస్తున్నాయని అధికారులు తెలుసుకొని పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని సూచించారు. ఎంపి వెంట మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, ఊకంటి గోపాల్ రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## లైంగిక వేధింపుల నివారణకై శిక్షణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,మే10(సమయం న్యూస్): సింగరేణి డైరక్టర్(పా) అండ్ పిపి కే.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జిఎం(హెచ్ఆర్డి) జి.రఘుపతి ఆధ్వర్యంలో "పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేదింపు" గురించి అవగాహన కల్పించుట కొరకు కొత్తగూడెం రీజియన్ లోని కార్పొరేట్, కొత్తగూడెం, మణుగూరు ఇల్లందు ఏరియాల అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధికారులకు సిబ్బందికి శనివారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయ హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ నందు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హిందూస్థాన్ అకాడమీ ఆఫ్ లా, విశాఖపట్నం ప్రొఫెసర్ వి.పార్వతీశం వారి చే ఒక్క రోజు శిక్షణా తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో హిందూస్థాన్ అకాడమీ ప్రొఫెసర్ వి.పార్వతీశం సెక్షన్4(1) ప్రకారం మహిళలు తమ పని ప్రదేశాలలో ఎదుర్కొనే లైంగిక వేదింపులు నివారణ రిష్కారం మొదలుగు అంశాలపై సంబంధించిన అన్ని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేస్ స్టడీస్ రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్డి డిజిఎం(పర్సనల్)నారాయణరావు, కొత్తగూడెం రీజియన్ లోని అంతర్గత ఫిర్యాదుల కమిటీ అధికారులు సిబ్బంది, హెచ్ఆర్డి డిపార్ట్మెంట్ సీనియర్ అసిస్టంట్ కే.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో మూడు రోజులు వర్షాలు

అంబర్ పేట, మే, 10(సమయం న్యూస్) : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. రానున్న రెండు రోజులు కూడా గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. అలాగే ఈరోజు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం



# కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి ని పరామర్శించిన ట్రై సిటీస్ అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

హన్మకొండ మే 10(సమయం న్యూస్) : కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో పరమపదించగా హనుమకొండలోని తన నివాసానికి వెళ్లి,కుడా మాజీ చైర్మన్ మరియు అతని కుటుంబ సభ్యులను ట్రై సిటీస్ అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రెంటాల కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శి నడుముల విజయకుమార్,



ఉపాధ్యక్షులు వాల కృపాకర్ రావు, జాయింట్ సెక్రటరీ కొమురవెల్లి శ్రీనివాస్, గ్రీన్ స్క్వేర్ అపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శి వాసికర్ల సత్యనారాయణ గారు, ఉపాధ్యక్షులు సముద్రాల కృష్ణారెడ్డి, రాఘవేంద్ర అపార్ట్మెంట్ అధ్యక్షులు పొన్నోజు అశోక్ గార్లు పరామర్శించారు. వీరితో పాటు వెంకట రంగారెడ్డి, మట్ట రాజశేఖర్ రెడ్డి, రమేష్ బి ఆర్ ఎస్ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.



# అనుమానిత వాహనాలను తనిఖీ...

* **గ్రామాలలో మత్తు పదార్థాలపై అవగాహన..**

నర్సాపూర్,10 మే,సమయం న్యూస్: నర్సాపూర్ మండలం బి వి ఆర్ ఐ సమీపంలో జిల్లా ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ జి శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం శనివారం తెల్లవారుజామున సంగారెడ్డి నుండి నర్సాపూర్ వెళ్ళే ప్రధాన రహదారిపై డ్రగ్స్ , గంజాయి వంటి అనుమానిత వాహనాలను తనిఖీ చేశారు. అంతేకాకుండా నర్సాపూర్ సమీపంలోని సూర్యా తండా, హరియా తండా, మాదాపూర్ తండాలలో దాడులు , మాదకద్రవ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి నాటుసారా వంటి మత్తు పదార్థాలు రవాణా చేసిన, అమ్మిన కేసులు నమోదు చేస్తామని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం యొక్క ప్రభావాలు దాని తీవ్రమైన పరిణామాలను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ ఐ లు తన సిబ్బంది పాల్గొన్నారు అని ఎక్సెస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాల్ అన్నారు.

# వైఎస్సార్సీపీ పార్టీ నుండి జనసేన పార్టీ లోకి బారీగా చేరికలు





మే10 (సమయం న్యూస్) : జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు మరియు పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే జయకృష్ణ చేస్తున్న అభివృద్ధిని చూసి పాలకొండ పట్టణం 10వ వార్డుకి చెందిన వైసీపీ వార్డు కౌన్సిలర్ కొంచాడ సరోజని, అరుణ్ దంపతులను ఎమ్మెల్యే జయక్రిష్ణ సాధారంగా పార్టీ లోకి ఆహ్వానించారు. జనసేన కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానం పలికారు. వారితో పాటు 10వ వార్డుకి చెందిన సుమారు 100 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్, ఎంపీటీసీ మజ్జి నవీన్, పాలకొండ తెలుగుదేశం నాయకులు శ్రీధర్, నాల్గవ వార్డు కౌన్సిలర్ కోరికన గంగూ నాయుడు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, ప్రశాంత్, రమేష్, వీరఘట్టం నాయకులు మత్స పుండరీకం, సాయి, చరణ్ పాల్గొన్నారు





# గుమ్మడిదల లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల,మే 10,సమయం న్యూస్: గుమ్మడిదల మున్సిపాలిటీ లోని నల్లవల్లి, ప్యారానగర్ పరిధిలో ప్రతిపాదిత డంప్ యార్డ్ కు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు శనివారము నాటికి 94వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు సిజేఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్మల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తహసిల్దార్ కార్యాలయంలో డంప్ యార్డ్ కు వ్యతిరేకంగా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ వినతులను తహసిల్దార్ కార్యాలయంలో ఇవ్వడం జరిగిందని. ఇకనైనా ప్రభుత్వం,అధికారులు స్పందించి ప్రజాభిప్రాయం మేరకు డంప్ యార్డును పూర్తిగా రద్దుచేసి, ఈ ప్రాంత ప్రజలకు రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రైతులు,మహిళలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు అర్హతల ఆధారంగా సరైన పరిహారం అందించాలి

* **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
* **మంథని మండలంలో పుట్టపాక గ్రామంలో భూనిర్వాసితుల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



మంథని, మే 10: (సమయం న్యూస్) : జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు అర్హతల ఆధారంగా సరైన పరిహారం అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం మంథని మండలంలో పుట్టపాక గ్రామంలో భూ నిర్వాసితుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వరంగల్ మంచిర్యాల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు సరైన పరిహారం అర్హతల ఆధారంగా అందాలని అన్నారు. రైతులు అందించిన భూములలో ఉన్న బావులు, మోటార్, పైప్ లైన్, పండ్ల , అటవీ చెట్లు మొదలగు నిర్మాణాలకు పరిహారం సరిగ్గా అందలేదని నిర్వాసితులు దరఖాస్తులు అందించారని కలెక్టర్ తెలిపారు. నిర్వాసితులు అందించిన ప్రతి దరఖాస్తును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హతల ఆధారంగా భూ సేకరణ జరిగే భూములలో ఉన్న నిర్మాణాలకు సరైన విలువ చూపిస్తూ ప్రతిపాదనలు తయారు చేసి అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు భూమిలో ఉన్న ప్రతి నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందజేసేలా చర్యలు తీసుకుంటామని, అధికారులు అందించే నివేదిక ప్రకారం జాతీయ రహదారుల సంస్థకు ప్రతిపాదనలు పంపి నిర్వాసితులకు పరిహారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీవో సురేష్ , జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య, ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్, హార్టికల్చర్ జిల్లా అధికారి జగన్మోహన్ రెడ్డి, తహసిల్దార్ కుమారస్వామి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ

* **సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య**

జిన్నారం, మే 10,సమయం న్యూస్ : మే 20 న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కె రాజయ్య ఆద్వర్యంలో శనివారం ఖాజిపల్లి లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం లేబర్ కోడ్ ను రద్దు చేసేవరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు. మే 20 న దేశవ్యాప్త సమ్మెకు అన్ని ట్రేడ్ యూనియన్లు పాల్గొని కేంద్ర ప్రభుత్వం మెడలు వంచే విధంగా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, సత్తయ్య, సుధాకర్ గౌడ్, శ్రీరాములుతదితరులు పాల్గొన్నారు.







# ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వండి

**: ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ**

మే 10: (సమయం న్యూస్) : పాలకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ పాల్గొన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి అంటే రోగులకు ధైర్యం, నమ్మకం భరోసా కలిగేలా సేవలు అందేలా చూడాలన్నారు నిమ్మక జయకృష్ణ. ఆక్సిజన్ నిల్వ ఉంచే ఏర్పాట్లపై చర్చించారు. సమిష్టి కృషి, సహకారంతో రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలను కల్పించాలన్నారు. వైద్య పరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. ప్రతిరోజు వచ్చే రోగులకు నాణ్యమైన, సంతృప్తికరమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అల్ట్రా సౌండ్ పరీక్షలలో మహిళల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి పరిశుభ్రత, పారిశుధ్యం మెరుగుణకు మరింత చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెట్లు నాటి పచ్చదనం పెంపొందించాలని అభివృద్ధి కమిటీ సభ్యులకు, వైద్యాధికారులుకు ఆయన సూచించారు. మానసిక ప్రశాంతత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా కృషి చేయాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన పరికరాలు ప్రభుత్వం నుండి రప్పించుటకు లేఖ ద్వారా కోరమని, తక్షణమే అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్న నిధుల నుండి కొనుగోలు చేయమని సూచనలు చేశారు. బయట ఆసుపత్రి లో డిప్యూటేషన్ పై పనిచేస్తున్న ఫిజిషియన్ మోహన్ బాబు వారిని ఆసుపత్రి శ్రేయస్సు దృష్ట్యా డిప్యూటేషన్ రద్దు పరచి మరలా వెనక్కి రప్పించుటకు తగు చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నేపు జవరాజు, సురవన్న సరస్వతి,అడప బాబ్జీ, పెనుగొండ రాజశేఖర్, ఎచ్చెర్ల జయరామ్, మునిసిపల్ చైర్మన్ ఆకుల మల్లీశ్వరి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు, వైస్ ఎంపీపీ వాకముడి అనిల్, ఎంపీటీసీ మజ్జి నవీన్, వెన్నపు శ్రీను, సుందరరావు, శ్రీను మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



* ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ని పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, ఏమ్మెల్యే మాధవరం క్రిష్ణ రావు
* ఇటీవల తన కాలుకు గాయమై చికిత్స పొందుతూన్న మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారిని పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు . ఈ సందర్భంగా వారి రోజువారి యోగక్షేమలను అడిగి తెలుసుకున్నారు.



# సజావుగా కొనుగోలు ప్రక్రియ

* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ మే 10( సమయం న్యూస్) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం రామాయణపేట మండలం అక్కన్నపేట లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్* సందర్శించి కొనుగోలుకి సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ...కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంకు తేమశాతం రాగానే కొనుగోలు ప్రక్రియ మొదలవ్వాలని... ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలు, రైతుల ఖాతా వివరాలను ఎలాంటి ఆలస్యం కాకుండ ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని సరిపడా టార్పాలిన్ లను,గన్ని సంచులను అందుబాటులో ఉంచుకోవాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి అనుగుణంగా..లారీలను ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, మండల తహసీల్దార్ పాల్గొన్నారు.



# అత్యధిక సార్లు రక్తదానం చేసిన కానిస్టేబుళ్ళను అభినందించిన సీపీ

హనుమకొండ మే 10(సమయం న్యూస్) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మూర్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కన్నె రాజు అలియాస్ స్విమ్మర్ రాజు, కెయుసి కానిస్టేబుల్ రవీందర్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం అభినందించారు. వరల్డ్ రెడ్ క్రాస్ దినోత్సవం పురస్కరించుకొని సుబేదారిలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ లో ఏర్పాటు చేసిన రక్త దాన కార్యక్రమంలో కానిస్టేబుల్ కన్నేరాజు 37వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేయగా, కానిస్టేబుల్ రవీందర్ 18 సార్లు రక్త దానం చేసినట్లుగా రెడ్ క్రాస్ సంస్థ కార్యవర్గ ప్రతినిధులు ముఖ్య అతిధి వరంగల్ పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకరావడంతో కన్నె రాజు, రవీందర్ లను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించడంతో పాటు ఇరువురు కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్లను అందజేశారు. రాజు, రవీందర్ లను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని. ముఖ్యంగా ఏప్రిల్, మే మాసల్లో రక్త నిధుల్లో రక్తం కొరత ఏర్పడుతుందని. కావున కొరతను ఆదిగమించేందుకు యువత రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని సీపీ సూచించారు.

# కాల్పుల విరమణను స్వాగతించిన మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

* **దేశాన్ని రక్షించడానికి భారత సైన్యం ధైర్యంగా పోరాటం చేసింది**
* **అమెరికా మధ్యవర్తిత్వం ఎందుకు ?**
* **ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించి అన్ని అంశాలను కేంద్రం ప్రజలకు వివరించాలి**
* **మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**




హైదరాబాద్ : భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాగతించారు. పాకిస్తాన్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన సైనికులకు నివాళులు అర్పించారు. దేశాన్ని, దేశ ప్రజలను రక్షించడానికి భారత సైన్యం ధైర్యంగా పోరాటం చేసిందని కొనియాడారు. భారత్, పాకిస్తాన్ మధ్య నెలకొన్న అంశాల విషయంలో ద్వైపాక్షికంగానే ఎప్పుడూ పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో ఎప్పుడూ లేనివిధంగా అకస్మాత్తుగా అమెరికా ఎందుకు ప్రవేశించి మధ్యవర్తిత్వం వహించాల్సి వచ్చిందో అన్న అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. భవిష్యత్తులో పాకిస్తాన్ ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండేందుకు మనం ఎంత గట్టిగా నిలవరించగలిగినం అన్న అంశాలపై ప్రధానమంత్రి, రక్షణ శాఖ మంత్రి దేశ ప్రజలకు వివరిస్తే బాగుంటుందని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అన్ని అంశాలపై చర్చించాలని అన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య సమస్యలు, అంశాలపై రెండు దేశాలు మాత్రమే కూర్చొని మాట్లాడాలని, ఇతర దేశాల జోక్యం చేసుకోవడం లేదా మధ్యవర్తిత్వం వహించడం సరికాదన్న అభిప్రాయం దేశ ప్రజల్లో ఉండిందని తెలిపారు. కానీ అకస్మాత్తుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ట్వీట్ చేయడం కొంత బాధ అనిపించిందని అన్నారు. మన ప్రధానమంత్రి ట్వీట్ చేసి ఉంటే మన దేశ గొప్పతనం మరింత పెరిగేదని చెప్పారు.

# విద్యుత్ వెలుగులతో గ్రామాల అభివృద్ధి

* **నాణ్యమైన కరెంటు ఇవ్వాలనే లక్ష్యంతో విద్యుత్ సబ్ స్టేషన్ ల ఏర్పాటు**
* **అశ్వరావుపేట నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధికి కృషి**
* **గత బిఆర్ఎస్ ప్రభుత్వం కోట్లు దండుకుంది**
* **కెసిఆర్ చేసిన అప్పలకు కాంగ్రెస్ ప్రభుత్వం అసలు వడ్డీ చెల్లిస్తుంది**
* **ఐ అండ్ పీఆర్ ద్వారా అసత్య ప్రచారానికి**
  **కెసిఆర్ సర్కార్ రూ. 1052 కోట్లు ఖర్చు**
* **మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 10(సమయం న్యూస్): విద్యుత్ విలువలతో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండలం పరకాల గండిలో రూ. 2.24 కోట్లతో అచ్యుతాపురంలో రూ. 3.10కోట్లతో, తిరుమలకుంటలో రూ. 3.15కోట్లతో, కావడిగుండ్లలో రూ. 2.24కోట్లతో, అశ్వారావుపేట పట్టణంలో రూ. 2.53కోట్లతో నూతనంగా చేపట్టబోయే 33/11 కెవి సబ్ స్టేషన్ ల శంకుస్థాపనకు, అదేవిధంగా రూ.24.46కోట్ల అంచనా వ్యయంతో 33కెవి ఫీడర్ల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టే కార్యక్రమం అశ్వారావుపేట నియోజకవర్గంలోని పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గం కొన్ని దశాబ్దాల కాలంగా వెనుకబడి ఉందని అలాంటి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. అందులో భాగంగానే ఉప ముఖ్యమంత్రి చొరవతో కరెంట్ వెలుగులు నింపేందుకు ఈ రోజు విద్యుత్ సబ్ స్టేషన్ ల ఏర్పాటుకు శంకుస్థాపన చేసుకుంటున్నామని పేర్కొన్నారు. వైఎస్సార్ హయాంలో ప్రతీ తండాకు ప్రతీ గ్రామానికి నాణ్యమైన కరెంట్ తో పాటు ఉచితంగా కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ దేనిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నాణ్యమైన కరెంట్ ఇచ్చేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

* **కాలేశ్వరం పేరుతో దోచుకున్న గత కేసీఆర్ ప్రభుత్వం...**

ఎనిమిదో అద్భుతం కాళేశ్వరం కడుతున్నామని అని చెప్పి రాష్ట్రాన్ని దోచుకున్న ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మంత్రి పొంగులేటి విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర సంక్షేమాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ధ్వజమెత్తారు. అయినప్పటికీ వాటన్నిటిని తట్టుకుని వారు చేసిన తప్పిదాలను సరిచేస్తూ ఎన్నికల్లో ఇచిన ప్రతీ హామీని నెరవేరుస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. ఎవరికీ ఉపయోగపడని ధరణిని పక్కన పెట్టి ప్రతీ ఒక్కరికీ ఉపయోగ పడేలా భూ భారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకురావడం జరిగిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 8లక్షల 19వేల కోట్ల రూపాయలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ నెల రూ. 6500 కోట్లు అస్సలు, మిత్తి కడుతూ వస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం చేసింది గోరంత చెప్పుకున్నది కొండంత అని తమ ప్రభుత్వం కొండంత చేసి గోరంత చెప్పుకుంటున్నామని పేర్కొన్నారు. ఐ అండ్ పీఆర్ ద్వారా రూ. 1052కోట్ల రూపాయలను అసత్యపు ప్రచారానికి గత బీఆర్ఎస్ పాలకులు అక్రమంగా వినియోగించుకున్నట్లు వివరించారు.

**విద్య వైద్య రంగానికి పెద్ద పీట...**

విద్యా వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తున్నామని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 50వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాస్ పేరుతో త్వరలోనే ప్రతీ నిరుద్యోగికి ఉపాధి కల్పించేందుకు లోన్లు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. గత ప్రభుత్వంలో కోళ్ల ఫారాల్లో, పాడుబడిన రైస్ మిల్లుల్లో ఉన్న గురుకులను పక్కన పెట్టి ఇంటిగ్రేటెడ్ గురుకులాల పేరుతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వేల కోట్ల రూపాయలతో గురుకులాల ఏర్పాటుకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు పెంచినట్లు చెప్పారు.

* మనసుంటే మార్గం ఉంటుందని పేదవాడి కళ్లలో చిరునవ్వు చూడాలని కాస్త ఇబ్బందులు ఎదురు అయినా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.
* కచ్చితంగా ఇచ్చిన మాట ప్రకారం రైతుని రాజును చేశామని రుణమాఫీని సక్రమంగా అమలు రైతు బంధు ఇచ్చామన్నారు. వర్షాకాలంలో సన్నాలకి బోనస్ ఇచ్చామని యాసంగిలో కూడా ఇస్తామని స్పష్టం చేశారు.
* పేదవాడికి ఏది ముందు అవసరమో అది ఇస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఇందిరమ్మ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని ఐటిడిఎ పరిధిలో ఉన్న నియోజకవర్గాల్లో కోటా కంటే ఎక్కువ ఇళ్లు కూడా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.
* పదిహేను పదహారు నెలల నుంచి ఏ విధమైన పాలనను తమ ప్రభుత్వం అందిస్తుందో రాబోయే మూడున్నర సంవత్సరాల్లో కూడా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు అదే విధమైన మంచి సుపరిపాలన అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో పాటు ఇతర శాఖల అధికారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆపరేషన్ సింధూర్ లో భాగంగా దాయాది పాకిస్తాన్పై జరుగుతున్న యుద్ధంలో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణం పొందడంపై మాజీ ఐఏఎస్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్.G.Srkr తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన సైనికుడు మురళి నాయక్ చిన్నయసులోనే దేశ సేవలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్బంగా మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశం కోసం తృణప్రాయంలో ప్రాణాలను అర్పించిన మురళీనాయక్ త్యాగం మరువలేనిదని.. ఆయన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. భరతమాత రక్షణలో భాగంగా ప్రాణత్యాగం చేసిన ప్రతి సైనికుడి త్యాగం, దేశ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ముష్కరమూకను భారత్ పై ఎగదోస్తున్న పాకిస్తాన్ పై సాగిస్తున్న పోరులో మన త్రివిధ దళాలు చూపిస్తున్న శౌర్యం వెలకట్టలేనిదని.. ఈ సమయంలో యావత్ భారతావని మన సైనికులకు అండగా నిలవాలని విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై జరుగుతున్న పోరులో భారత్ విజయపతాకం ఎగురవేయాలని ఆకాంక్షించారు.**





# వలస కూలీ కుటుంబానికి అన్నీ తానై అండగా నిలిచిన ఎమ్మెల్యే నాగరాజు

* **పిడుగుపాటుతో మరణించిన బీహార్ హమాలీ బిట్టు భౌతిక దేహానికి నివాళులర్పించి ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే నాగరాజు గారు....**
* **పిడుగుపాటు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మూడు గణేష్ పరిశీలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన ఎమ్మెల్యే నాగరాజు గారు...**



వరంగల్ మే10( సమయం న్యూస్) : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని కోనాపురం సమీపంలో వర్ధన్నపేట పాక్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పిడుగుపాటుకు బీహార్ రాష్ట్రానికి చెందిన బిట్టు విన్ అనే వలస కూలి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాలు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా వర్షం కురవడంతో చెట్టు క్రిందికి తలదాచుకోవడానికి వెళ్లగా పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలుసుకున్న గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు మృతదేహం వద్దకు వెళ్లి నివాళులు అర్పించి తక్షణ సహాయంగా 15000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం వర్ధన్నపేట వేంకటేశ్వర తండా చెందిన మూడు గణేష్ పిడుగుపాటుకు గురై పట్టణం కేంద్రంలో ప్రైవేట్ ఆసుపత్రిలో అతన్ని పరామర్శించి డాక్టర్ల తో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం వెంటనే వరంగల్ ఎంజిఎం ఆసుపత్రి తరలించాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు మాట్లాడుతూ. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పనిచేస్తున్న సమయంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన వలస కార్మికుని మరణం నన్ను తీవ్రంగా కలిచివేసింది. వలస కార్మికులు మన రాష్ట్ర అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారు. ఇలాంటి విషాదకర సంఘటన జరగడం దురదృష్టకరం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇస్తున్నాను. వారికి తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. కొనుగోలు కేంద్రాల వద్ద కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మార్వో విజయ సాగర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆ మూడు నగరాల్లోనే మిగిలిన ఐపీఎల్ మ్యాచ్‌లు!



భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రస్తుతానికి ఆగిపోయిన విషయం తెలిసిందే. మిగిలిన 16 మ్యాచులను దక్షిణ భారత దేశంలో నిర్వహించాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు సమాచారం. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వేదికగా వాటిని నిర్వహించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

*** భారత ప్రభుత్వం అనుమతిస్తే...**

భారత ఉత్తర, పశ్చిమ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ 2025 సీజన్‌లోని మిగతా మ్యాచ్‌ల నిర్వహణ విషయంలో అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం అనుమతి ఇస్తే.. బీసీసీఐ ఉద్రిక్తంగా ఉన్న సరిహద్దులకు దూరంగా దక్షిణాదికి చెం దిన ఆ మూడు నగరాల్లో మిగతా ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించాలనే ప్రణాళికతో ఉన్నట్లు సమాచారం.

*** మరింత కాలం వాయిదా?!**

ప్రస్తుతం ఐపీఎల్ 2025ను బీసీసీఐ ఓ వారంపాటు వాయిదా వేసింది. కానీ నిజానికి వారం తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లను తిరిగి ప్రారంభించడంలో ఎదురయ్యే సవాళ్ల గురించి బీసీసీఐ, ఆయా ఫ్రాంచైజీలకు అనధికారికంగా తెలియజేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా ఈ ఏడాది చివరి వరకు మ్యాచ్‌లు వాయిదా పడే అవకాశమే ఎక్కువగా ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.

*** విదేశీ ఆటగాళ్లు తిరిగి రాకపోవచ్చు!**

విదేశీ ఆటగాళ్లు, సహాయక సిబ్బంది ఇప్పటికే వారి స్వస్థలాలకు పయనమయ్యారు. వీరిలో కొంతమంది త్వరలోనే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ పాల్గొనాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఒకవేళ ఐపీఎల్ 2025 తిరిగి ప్రారంభమైనా వారు రావడం అనుమానాస్పదమే. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు జూన్ 11 నుంచి టెస్ట్ ఛాంపియన్ షిప్ ఆడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్ తిరిగి ప్రారంభమైనా ఈ దేశాలకు చెందిన ఆటగాళ్లు పాల్గొనడం సందేహమే.

## భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణ... ఐపీఎల్ పునఃప్రారంభంపై బీసీసీఐ కీలక సమావేశం



భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మే 8న ధర్మశాలలో జరగాల్సిన మ్యాచ్‌ను అర్ధంతరంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. తర్వాత ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేసింది. తాజాగా కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్ అంగీకరించడంతో ఐపీఎల్ పునఃప్రారంభానికి మార్గం సుగమమైంది. 'శనివారం సాయంత్రం 5 గంటల నుంచి భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణ పాటించనున్నాయి' అని మధ్యవర్తిత్వం వహించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరు దేశాలూ ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. దీంతో ఐపీఎల్ పునఃప్రారంభంపై క్రికెట్ అభిమానుల్లో ఆశలు చిగురించాయి. సరిహద్దులకు దూరంగా దక్షిణ భారతదేశంలోని బెంగళూరు, చెన్నై, హైదరా బాద్ వేదికగా మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఉందని కాల్పుల విరమణ ప్రకటనకు ముందే వార్తలు వచ్చాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ఐపీఎల్‌లో ఇంకా మిగిలి ఉన్న 16 మ్యాచ్‌ల నిర్వహణ విషయమై మే 11న బీసీసీఐ కీలక సమావేశం నిర్వహించనుంది. వీలైనంత త్వరగా ఐపీఎల్ మ్యాచ్‌ల పునఃప్రారంభంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# సినిమా




## 'ఆపరేషన్ సిందూర్' మూవీ ఫస్ట్ లుక్

పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా ఇండియన్‌ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో బాలీవుడ్ లో సినిమా రానుంది. ఉత్తమ్ నితిన్ దర్శకత్వంలో, నిక్కీ విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కనుంది. దీనిపై తాజాగా అధికారిక ప్రకటన చేసి ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను రిలీజ్‌చేశారు మేకర్స్. మే 6 ,7 మధ్య రాత్రి భారత సాయుధ దళాల నిజ జీవిత ఆపరేషన్ ఆధారంగా ఈ సినిమా రూపొందిస్తున్నారు.. ఈ పోస్టర్‌లో టైటిల్ పై 'భారత్ మాతా కీ జై' అని రాసి ఉంది. ఆర్మీ యూనిఫాం ధరించి.. రైఫిల్ పట్టుకొని నుదుటన సిందూరం పెట్టుకుంటోన్న మహిళ కనిపించింది. అలాగే బ్యాక్‌గ్రౌండ్‌లో ట్యాంకులు, ముళ్ల కంచెలు, ఫైటర్ జెట్‌లను, మండుతున్న యుద్ధ భూమిని చూపారు. ఇవి ధైర్యం, త్యాగం, జాతీయవాదం ఇతివృత్తాలను బలోపేతం చేస్తాయంటున్నారు సినీ విశ్లేషకులు. త్వరలోనే నటీనటుల వివరాలను వెల్లడించనున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. కాగా ఉగ్రవాద లోకానికి వణుకు పుట్టించిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సినిమా తీసేందుకు సినీ దర్శక నిర్మాతలు పోటీపడ్డారు. ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌లో జీ స్టూడియోస్, టీసిరీస్ లాంటి కొన్ని బాలీవుడ్ బడా నిర్మాణసంస్థలు కూడా ఈ పేరు కోసం పోటీపడుతూ రిజిస్టర్ చేసుకున్న విషయం తెలిసిందే.

## ప్లీజ్ అలా చేయకండి




పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్ ఉగ్రమూకలపై విరుచుకుపడింది. దాయాది దేశంతో పాటు 9 కీలక స్థావరాలను నేలమట్టం చేసింది. ప్రస్తుతం భారత్, పాక్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈనేపథ్యంలో నెటిజన్లు, సినీ సెలబ్రిటీలు ఇండియన్‌ఆర్మీకి అండగా నిలుస్తున్నారు. వారికి విరాళం ఇస్తూనే తమ అభిప్రాయాలను తెలుపుతూ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వార్‌కి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. కొందరు యుద్ధంపై ఫన్నీ రీల్స్ చేస్తూ నెట్టింట షేర్ చేస్తున్నారు. దీనిపై తాజాగా నటి రేణు దేశాయ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఫైర్‌అయ్యింది. 'ఇప్పుడు యుద్ధ పరిస్థితులు తీవ్రతరంగా ఉన్నాయి. కొంతమంది వ్యూస్ కోసం ఫన్నీ రీల్స్, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. మనం ప్రశాంతంగా నిద్రపోతున్నామంటే కారణం మన జవాన్లే. వారి ఫ్యామిలీలు, సరిహద్దుల సమీపంలో నివసించే సైనికులు.. దేశంలోని అమాయక పౌరుల బాధని దయచేసి అర్థం చేసుకోండి . మన ప్రార్థనలు ఎప్పుడు వారికి అండగా ఉంటాయి. సున్నితమైన సమయంలో ఐక్యంగా ఉండాలి. ఎక్కువ వ్యూస్, లైక్స్ కోసం అలాంటి వీడియోలు చేయొద్దు' అంటూ చేతులెత్తి దండం పెట్టే ఎమోజీని షేర్ చేసింది.

## సారీ చెప్పను



ఇండియా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ని ప్రశంసిస్తూ పోస్ట్ పెట్టినందుకు బాలీవుడ్ నటిసెలీనా జైట్లీకి బెదిరింపులు వచ్చాయి. భారత్‌ని పొగిడితే అన్‌ఫాలో చేస్తామంటూ కొంతమంది నెటిజన్లు ఆమెకు వార్నింగ్ ఇచ్చారు. అలాగే జైట్లీని ట్రోల్స్ చేయడం ప్రారంభించారు. దీనిపై తాజాగా ఆమె స్పందించింది. తాను ఉగ్రవాదానికిఎప్పుడూ వ్యతిరేకమేనని.. నచ్చని వాళ్లు తనను అన్‌ఫాలో చేసుకోవచ్చని చెప్పింది. 'నా దేశం(భారత్) గురించి మాట్లాడితే అన్‌ఫాలో చేస్తామని కొంతమంది బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. వారందరిని నేను ఒకటే చెబుతున్నా.. నా దేశం కోసం స్టాండ్ తీసుకున్నందుకు నేను ఎప్పటికీ, ఎవ్వరికీ సారీ చెప్పను. ఉగ్రవాదం పేరుతో అమాయకులను చంపుతుంటే స్పందించకుండా మౌనంగా ఉండలేను. హింసను ప్రోత్సహించే వారివైపు నేను ఉండను. భారత్‌పై నాకున్న ప్రేమ మిమ్మల్ని బాధపెడితే నన్ను అన్‌ఫాలో చేయండి. నేను శాంతి, సత్యం కోసం నిలబడతాను. నా దేశ సైనికుల వెంటే నేనుంటాను. నా దేశ సైనికులు కులం, మతం అడగకుండా మమ్మల్ని రక్షిస్తున్నారు. మీ ట్రోల్స్‌ని గమనిస్తున్నాను. ఇలాంటి వారిని క్షమించను. జైహింద్'అని ఇన్‌స్టాలో రాసుకొచ్చింది.

## ఇకపై అలాంటి పాత్రల్లోనే!



అన్యాయాన్ని ఎదిరించే న్యాయవాదిగా 'కేసరి ఛాప్టర్ 2' సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న కథానాయిక అనన్యపాండే. ఇప్పుడామె సవాలుతో కూడిన పాత్రల్లో నటించాలంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య తన కథల ఎంపిక గురించిన పలు విషయాలను పంచుకుంది. ''బ్యాడ్ న్యూజ్', 'కాల్ మీ బె'లాంటి సినిమాల్లో ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలన్నీ కామెడీ నేపథ్యంలో రూపొందినవే. గ్లామరస్ పాత్రల్లో నటిస్తే మంచి అనుభూతి వస్తుంది అనుకున్నా.. కానీ 'కేసరి ఛాప్టర్ 2' చేసిన తర్వాతే తెలిసింది. సవాలుతో కూడిన పాత్రల్లో నటిస్తే వచ్చే ఆ అనుభూతి వేరు. ఇప్పుడు నేను ఆ అనుభూతిని రుచి చూశాను.




## హాలీవుడ్‌లో తొలి అడుగు

ఎమర్జెన్సీ' చిత్రంతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్. దర్శకురాలిగా, నటిగా వైవిధ్యమైన కథలతో ఇప్పటికే బాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈమె.. ఇప్పుడు హాలీవుడ్‌లోకి అడుగుపెట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆమె ప్రధాన పాత్రలో 'బ్లెస్డ్ బి ది ఈవిల్' అనే ఇంగ్లిష్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. ''కంగన కోసం లయన్ మూవీస్ ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్న చిత్రమిది. గర్భస్రావం తర్వాత బిడ్డను కోల్పోయిన బాధలో ఉంటుంది ఓ జంట. మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకుంటున్న వారిని ఓ దుష్ట శక్తి ఎలాంటి తిప్పలు పెట్టిందనే కథాంశం చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. అతీంద్రియ శక్తులు.. జానపద కథల నేపథ్యంలో అనురాగ్ రుద్ర దీన్ని తీర్చిదిద్దుతున్నారు. టైలర్ పోసీ, స్కార్లెట్ రోజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అమెరికాలో చిత్ర నిర్మాణాలకు ట్రంప్ విధించిన టారిఫ్‌కు సంబంధించిన పనుల్ని పూర్తి చేసిన తర్వాత ఈ వేసవిలో న్యూయార్క్‌లో చిత్రీకరణను మొదలు పెట్టనున్నార''ని కంగన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.